


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 16, పేజీలు - 08




శనివారం, జులై 11, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## రాములోరి మీద ఆన.. పాతాళానికి తొక్కేస్తాం!

### ఖమ్మం సభలో సీఎం రేవంత్ సంచలనం జోస్యం

- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
- జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు - కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మరోసారి అత్యంత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన కాంగ్రెస్ రైతు ఆశీర్వాద సభ బహిరంగ సభ వేదికగా ఆయన బీఆర్ఎ అధినేత కేసీఆర్ కుటుంబానికి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి శాశ్వతంగా పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ సైనికులు, కార్యకర్తలు నిద్రపోరని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాచుకో కేసీఆర్, నీ బలగమంతా ఈ మాట గుర్తుపెట్టుకోండి. భద్రాచలం సీతారామచంద్రస్వామి సాక్షిగా ఒట్టేసి చెబుతున్నా వచ్చే ఎన్నికల్లో మిమ్మల్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తాం అంటూ సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

#### - 2029 జూన్‌లో ఎన్నికలు.. 182 అసెంబ్లీ స్థానాలు!

సరికొత్త జాతీయ రాజకీయ సమీకరణాలను తెరపైకి తెస్తూ రేవంత్ రెడ్డి దేశవ్యాప్తంగా జరగబోయే జమిలి ఎన్నికల ప్రణాళికపై క్లారిటీ ఇచ్చారు. దేశంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ, అరవింద్ కేజ్రీవాల్‌కు చెందిన ఆప్ వంటి ప్రాంతీయ పార్టీలను చీల్చడానికి కేంద్రంలోని బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. కేంద్రం అనుకున్న బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించుకునే కుట్రల్లో భాగంగా దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ బిల్లు కచ్చితంగా ఆమోదం పొందుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో అసెంబ్లీ స్థానాల సంఖ్య భారీగా పెరగనుందని, 2029 మే లేదా జూన్ నెలల్లో తెలంగాణ అసెంబ్లీకి సరికొత్త రీతిలో ఎన్నికలు జరుగుతాయని ఆయన అంచనా వేశారు. పునర్వ్యవస్థీకరణ తర్వాత తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 26కు, అసెంబ్లీ స్థానాలు 182కు పెరుగుతాయని సీఎం సరికొత్త లెక్కలను ప్రకటించారు.

#### పెరిగే స్థానాల్లో 117 సీట్లు కాంగ్రెస్‌వే



రాబోయే ముందస్తు రాజకీయ ముఖచిత్రంలో పెరిగే 182 అసెంబ్లీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే 117 స్థానాలను కైవసం చేసుకుని మళ్లీ ప్రభంజనం సృష్టిస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను చెప్పిన రాజకీయ జోస్యం ఎలా ఫలించిందో ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా నేను ఇలానే జోస్యం చెప్పాను. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 65 సీట్లతో అధికారంలోకి వస్తుందని స్పష్టంగా ప్రకటించాను. మేము అనుకున్నట్లుగానే నాడు 64

2లో..

## నా నోరు మూయించాలంటే.. నన్ను చంపాలి

### - బీజేపీపై మమత ఫైర్



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభం మధ్య ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తన నోరు మూయించాలంటే తనను చంపాల్సిందేనని వ్యాఖ్యానించారు. పార్టీ నేతలను భయపెట్టేందుకు, వేధించేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వీడియో సందేశం ద్వారా మాట్లాడిన మమతా బెనర్జీ టీఎంసీని వీడి బీజేపీలో చేరని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తనపై, పార్టీపై ఒత్తిడి తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ "నన్ను మౌనంగా చేయాలంటే నన్ను చంపాల్సిందే. అందుకోసం కూడా మీరు ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా వదల్లేదు" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ సభ్యులు అభిషేక్ బెనర్జీ, మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీలతో పాటు తన ఇంటిని కూడా లక్ష్యంగా చేసుకున్నారని మమత ఆరోపించారు. తమ పార్టీ నాయకులను నిరంతరం వేధిస్తున్నారని విమర్శించారు. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చిందని మమత ఆరోపించారు.

2లో..

## కాంగ్రెస్‌కు కంటి చూపు సమస్యా.?

### - ఒవైసీ కాలేజీపై హైడ్రా ఎందుకు ఉలకదు.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. ప్రపంచమంతా చూస్తున్నా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి చెందిన

విద్యాసంస్థలు చెరువు ఆక్రమణల్లో లేవని కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపేందుకు ఉత్సాహం చూపే ప్రభుత్వం అందరికీ స్పష్టంగా కనిపిస్తున్న ఎంఐఎం ఆక్రమణల వైపు కన్నెత్తి కూడా చూడలేకపోతోందన్నారు.

#### - కాంగ్రెస్ నేతలకు ఉచిత నేత్ర పరీక్షలు

చెరువు ఆక్రమణల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలు కంటి చూపు సమస్యా? లేక రాజకీయ సంకల్పం లోపించిందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుల కళ్ళు తెరిపించేందుకు ఆయన తన పార్టీ శ్రేణులకు

2లో..

## ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత

### - మంత్రి లోకేశ్ పర్యటన సఫలం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, సియోల్‌లో ప్రముఖ ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ సంస్థలైన మోటివ్‌లింక్, షిన్‌హ్యుప్ ఎలక్ట్రానిక్స్ యాజమాన్యాలతో ఆయన కీలక సమావేశాలు నిర్వహించారు.

2లో..

## సోషల్ మీడియా సైకోల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

### - సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ

- రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు.. డీజీపీ నివేదికతో యాక్షన్ ప్లాన్!
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** భావప్రకటన స్వేచ్ఛ ముసుగులో సోషల్ మీడియా వేదికగా చెలరేగిపోతూ, అడ్డగోలు ట్రోలింగ్‌కు పాల్పడుతున్న వికృత మనస్తత్వాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై అత్యంత సీరియస్ చర్చ జరిగింది. సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేసే వారిపై, వ్యక్తిగత దూషణలకు దిగే వారిపై చట్టపరమైన చర్యలను వేగవంతం చేసేందుకు , పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక టాస్క్‌ఫోర్స్ నియమించాలని కేబినెట్ నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తూ, సమాజంలో అశాంతి రేపుతున్న వారిని ఇకపై ఏమాత్రం ఉపేక్షించేది లేదని

2లో..

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా

- తమ ప్రభుత్వం వస్తే రైతును రాజును చేస్తానన్న కవిత
- పాంచజన్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని వెల్లడి
- గిరిజనుల హక్కుల సాధన కోసమే పార్టీ పెట్టానన్న కవిత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే రైతును రాజును చేసి చూపిస్తా అని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు. దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని 'పాంచజన్యం' పేరుతో ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాజకీయాల కోసం రాలేదని ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన

2లో..

## సుప్రీంకోర్టులో కలకలం!

- జడ్జిలపై పిటిషనర్ ఆగ్రహం
- పత్రాలు విసిరి దుర్భాషలు
- బయటకు గెంటేసిన సెక్యూరిటీ!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఊహించని విధంగా తీవ్ర గందరగోళం, డ్రామా చోటుచేసుకుంది. అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా స్వయంగా వాదనలు వినిపించడానికి లిటిగెంట్-ఇన్-పర్సన్ గావచ్చిన ఒక వ్యక్తి కోర్టు హాల్లో వీరంగం సృష్టించాడు. న్యాయమూర్తులపైకి కేసు ఫైళ్లను విసిరేయడమే కాకుండా, బహిరంగ కోర్టులోనే జడ్జీలను ఉద్దేశించి తీవ్రమైన బూతులు తిడుతూ రెచ్చిపోయాడు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు లాగేశారు.

#### - నేను సార్వభౌముడిని.. మిమ్మల్ని ఆదేశిస్తున్నా! : పిటిషనర్ వింత ప్రవర్తన

జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఎదుట ఈ వింత పరిణామం వెలుగుచూసింది. కోర్టు విచారణ ప్రారంభం కాగానే, ప్రబల్ ప్రతాప్ అనే సదరు పిటిషనర్ కనీస చట్టపరమైన వాదనలు వినిపించకుండా అత్యంత దూకుడుగా మాట్లాడటం ప్రారంభించాడు. మిస్టర్ జ్యుడీషియల్ సర్వెంట్, ఉత్తరప్రదేశ్ లక్నో ఏసీపీపై, డూప్లెక్స్ టెక్నాలజీస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను. ఎందుకంటే నేను సార్వభౌముడిని" అంటూ జడ్జీలకే హుకుం జారీ చేశాడు.

#### - షాకైన జడ్జీలు.. కోర్టు హాల్లో ఫైళ్ల వర్షం!

పిటిషనర్ ప్రవర్తనకు ధర్మాసనం ఒక్కసారిగా

2లో..

## హరీష్ కాంగ్రెస్ లోకి వస్తానంటే.. పీసీసీ చీఫ్ బిగ్ ఆఫర్

- పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావు కుంగిపోయే ప్రాజెక్టులు కట్టారన్న మహేశ్ గౌడ్
- ఇప్పుడు ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఈటల బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా ఉందని ఎద్దేవా

2లో..



## హైదరాబాద్‌లో బోనాల సందడి

- జూలై 16 నుంచి బోనాల జాతర మొదలు
- జాతర బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భాగ్యనగరంలో బోనాల ఉత్సవాల సందడి మొదలు కానుంది. తెలంగాణ సంస్కృతి, సాంప్రదా యాలకు నిలువెత్తు రూపంగా నిలిచే హైదరాబాద్ ఆషాఢ బోనాల ఉత్సవాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇందుకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది బోనాల జాతర జులై 16వ తేదీ నుండి ప్రారంభమై, ఆగస్టు 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనుంది. కోట్లాది మంది భక్తులు తరలివచ్చే ఈ చారిత్రాత్మక ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఆషాఢ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు.

2లో..

## కరూర్ బాధితులకు అండగా సీఎం విజయ్

### - మాట నిలబెట్టుకొని ఉద్యోగాలు



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు టీవీకే అధినేత, సీఎం జోసెఫ్ విజయ్. వెండితెరపై "దళపతి"గా కోట్లాది అభిమానులను సంపాదించుకున్న

2లో..

## మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రధాని మోదీ

### - స్టీవ్ వాకు 20 ఏళ్ల నాటి అరుదైన కానుక!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్రికెట్ దౌత్యంతో ఇరు దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేశారు. తన మూడు రోజుల పర్యటనలో చివరి రోజైన శుక్రవారం, ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మక మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా

2లో..

## నా నోరు మూయించాలంటే.. నన్ను చంపాలి

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను దుర్వినియోగం చేసి, కేంద్ర బలగాల సహాయంతో కౌంటింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకుని ఎన్నికలను ప్రభావితం చేసిందని విమర్శించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం అనంతరం ఆ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వీడగా, కొందరు పార్టీ నాయకత్వం, ముఖ్యంగా అభిషేక్ బెనర్జీపై విమర్శలు చేశారు. పార్టీలో అవినీతి పెరిగిందని కూడా ఆరోపించారు. మరోవైపు టీఎంసీకి రాజీనామా చేసిన రాజ్యసభ సభ్యులు సుఖేందు శేఖర్ రాయ్, సుష్మితా దేవ్, ప్రకాశ్ చిక్ బరైక్ గురువారం బీజేపీలో చేరారు. అనంతరం జులై 24న జరగనున్న రాజ్యసభ ఉప ఎన్నికలకు బీజేపీ వారిని అభ్యర్థులుగా ప్రకటించింది.

## కాంగ్రెస్‌కు కంటి చూపు సమస్యా.?

ఒక వినూత్న పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి బీజేపీ కార్యకర్త కాంగ్రెస్ నాయకుల కోసం ఉచిత నేత్ర పరీక్ష శిబిరాలను నిర్వహించాలని సూచించారు. అలా నేత్ర పరీక్షలు చేసిన తర్వాత కూడా వారికి ఒవైసీ కళాశాల ఉన్న చెరువు కనిపించకపోతే సమస్య వారి కంటి చూపులో లేదు, కాంగ్రెస్ చేస్తున్న దిగజారుడు రాజకీయాల్లోనే ఉందని బండి సంజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**- కాంగ్రెస్ అవసరాలకు అనుగుణంగా మారుతున్న ఎఫ్‌టీఎల్ గీతలు!**

హైదరాబాద్ నగరంలో చెరువుల పూర్తి ముంపు పరిధి నిర్ధారణపై బండి సంజయ్ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ అవసరాలకు, మిత్రపక్షాల ప్రయోజనాలకు అనుగుణంగా ఎఫ్‌టీఎల్ సరిహద్దు గీతలను ఇష్టానుసారంగా మారుస్తోందనే అనుమానాలు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. పేదలు, సామాన్యులు కట్టుకున్న ఇళ్లకు ఒక న్యాయం అధికార పక్షానికి దగ్గరగా ఉంటూ రాజకీయ లబ్ధి చేకూర్చే వారికి మరో న్యాయమా? అంటూ ఆయన నిలదీశారు. చట్టం అనేది అందరికీ సమానంగా అమలవ్వాలి తప్ప అధికారంలో ఉన్నవారు తమకు నచ్చినట్లు ఎంపిక చేసుకుని అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు.

**- ప్రజల ప్రశ్నకు సమాధానం చెప్పాలి!**

చెరువులు, నాలాల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ద్వంద్వ వైఖరిని తక్షణమే వీడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. పేదలపై చూపించే ప్రతాపం, బడా రాజకీయ నేతల అక్రమ కట్టడాలపై ఎందుకు చూపించడం లేదో చెప్పాలన్నారు. నగర ప్రజలందరికీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న నిజం సకల అధికారాలు, శాటిలైట్ మ్యాప్‌లు ఉన్న ప్రభుత్వానికి ఎందుకు కనిపించడం లేదో కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైడ్రా చర్యలు కేవలం విపక్షాలను, సామాన్యులను భయపెట్టడానికే తప్ప నిజమైన చెరువుల రక్షణ కోసం కాదనేది ఒవైసీ కాలేజీ వ్యవహారంతో తేలిపోయిందని ఆయన విమర్శించారు.

## ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత

ఏపీలో తయారీ యూనిట్లు స్థాపించి, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు.

**- నాయుడుపేటలో షిన్‌హ్యూప్ భారీ పెట్టుబడి**

ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీ) తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ.1,595 కోట్ల భారీ పెట్టుబడితో తమ సంస్థ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఈ సందర్భంగా టేహూ కిమ్ ప్రకటించారు. ఈవీ/ఆటో, హెల్త్‌కేర్, స్మార్ట్ మీటరింగ్ రంగాలకు అవసరమైన పీసీబీలు, సీసీఎల్, ఈఎంఎస్‌లను ఇక్కడ తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 2,170 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు. ఏపీని తమ తయారీ కేంద్రంగా ఎంచుకున్నందుకు షిన్‌హ్యూప్ యాజమాన్యానికి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. నాయుడుపేట వద్ద ఇప్పటికే అభివృద్ధి చేసిన పీసీబీ ఎకోసిస్టమ్‌లో సిర్మా, జెట్‌వర్క్, ఎపిటోమ్, సిప్సా టెక్ వంటి నాలుగు కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఏపీలో ఒక ఎండ్-టు-ఎండ్ పీసీబీ క్లస్టర్‌ను నిర్మించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని షిన్‌హ్యూప్‌ను కోరారు. ఈ ప్రతిపాదనను సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టేహూ కిమ్ హామీ ఇచ్చారు.

**- శ్రీసిటీకి మోటివ్‌లింక్‌ను ఆహ్వానించిన లోకేశ్**

ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ మోటివ్‌లింక్ సీఈవో కిమ్ కి-హాన్‌తో కూడా మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. శ్రీసిటీలో ఈవీ విడిభాగాలు, ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్స్, ఇతర మాగ్నెటిక్స్ కాంపోనెంట్స్ తయారుచేసే యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు శ్రీసిటీలో సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఇప్పటికే శ్రీసిటీలో ఎంసీఎన్‌ఈఎక్స్, సోలమ్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వంటి కొరియన్ కంపెనీలు విజయవంతంగా పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. దీనిపై స్పందించిన మోటివ్‌లింక్ సీఈవో కిమ్ కి-హాన్, తమ సంస్థ ఇప్పటికే భారత్‌లో అడుగుపెట్టిందని తెలిపారు. తమిళనాడులోని చెన్నైలో స్టెర్లింగ్ టూల్స్‌తో కలిసి ఒక జాయింట్ వెంచర్‌ను, శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ ఆటో క్లస్టర్‌లో తమ తొలి స్వతంత్ర ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని ఆయన మంత్రి లోకేశ్‌కు హామీ ఇచ్చారు. మొత్తం మీద లోకేశ్ కొరియా పర్యటన ఏపీకి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో సానుకూల ఫలితాలనిస్తోంది.

## సోషల్ మీడియా సైకోల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

**- డీజీపీ సంచలన నివేదిక - ప్రభుత్వంపై కుట్రపూరిత ప్రచారం!**

ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర పోలీస్ బాస్ సోషల్ మీడియా అక్రమాలపై ఒక సమగ్రమైన ప్రత్యేక నివేదికను మంత్రివర్గం ముందు ఉంచారు. ఇటీవల అరెస్ట్ అయిన ప్రశ్న ఛానెల్ నిర్వాహకుడు జోసఫ్ రావణ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు, గ్రూపులు పనిగట్టుకుని ప్రభుత్వంపై తప్పుడు, అబద్ధపు ప్రచారాలు చేస్తున్న తీరును నివేదికలో ఆధారాలతో సహా పొందుపరిచారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అత్యంత వ్యూహాత్మకంగా విద్వేషాన్ని నూరిపోస్తున్నారని డీజీపీ నివేదికలో పేర్కొనడం కేబినెట్‌లో తీవ్ర కలకలం రేపింది.

**- చట్టపరమైన చర్యల కోసం అదనపు పీపీల నియామకం!**

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై నిరంతరం నోటి విరోచనాలు చేసుకునే ఇటువంటి మానసిక రోగులకు చట్టం పవర్ చూపించాల్సిందేనని మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. సోషల్ మీడియా నేరగాళ్లపై నమోదవుతున్న కేసులను కోర్టుల్లో బలంగా వాదించడానికి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చేయడానికి అవసరమైతే ప్రత్యేకంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సైబర్ క్రైమ్ చట్టాలను మరింత కఠినంగా అమలు చేస్తూ, ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారణ జరిపించేలా న్యాయపరమైన మౌలిక వసతులను బలోపేతం చేయాలని ఐటీ, హోంశాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

**- సెలబ్రిటీ పిచ్చికి షాక్ ట్రీట్‌మెంట్**

అరెస్ట్ అయితే పబ్లిసిటీ వస్తుందనే చీప్ పాపులారిటీ పిచ్చితో రెచ్చిపోతున్న వారికి ఈ టాస్క్‌ఫోర్స్ చర్యలు ఒక గట్టి షాక్ ట్రీట్‌మెంట్ కానున్నాయి. ఒకసారి తప్పు చేస్తే మళ్లీ జీవితంలో సోషల్ మీడియా వైపు చూడాలన్నా భయపడేలా జైలు శిక్షలు, భారీ జరిమానాలు పడేలా లీగల్ యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది.

ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే కుటుంబాలను రోడ్డుకు ఈడ్చడం, మతపరమైన విద్వేషాలు రేపడం వాక్ స్వేచ్ఛ కిందికి రాదనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఫేక్ ఐడీల వెనుక దాక్కుని వికృతానందం పొందే సోషల్ మీడియా సైకోల ఐపీ అడ్రస్‌లను ట్రాక్ చేసి మరీ పట్టుకునేలా సరికొత్త సాంకేతికతను ఈ టాస్క్‌ఫోర్స్‌కు అనుసంధానించనున్నారు.

**- డిజిటల్ ప్రక్షాళన దిశగా ఆంధ్రప్రదేశ్!**

గత ఐదేళ్లుగా సోషల్ మీడియాను వేదికగా చేసుకుని సాగిన బూతుల సంస్కృతికి, మార్ఫింగ్ దందాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో మైలురాయిగా మారనుంది.

వ్యవస్థలను, కుటుంబాలను టార్గెట్ చేస్తూ పెచ్చరిల్లిపోతున్న డిజిటల్ అరాచకత్వాన్ని తుడిచిపెట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగుతుండటంతో త్వరలోనే క్షేత్రస్థాయిలో దీని ఫలితాలు కనిపించనున్నాయి. సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని, సోషల్ మీడియాలో పద్ధతిగా ప్రశ్నించే సంస్కృతిని కాపాడేందుకు ఈ డిజిటల్ ప్రక్షాళన ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నారు.

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా

సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు.మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది, గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి, ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

## సుప్రీంకోర్టులో కలకలం!

దిగ్భ్రాంతికి గురైంది. నువ్వు మమ్మల్ని ఆదేశిస్తున్నావా? అని జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. దానికి సదరు వ్యక్తి నా వైపు నుంచి చెప్పాల్సింది అంతే, అంతా రికార్డుల్లో ఉంది అంటూ తన చేతిలోని కేసు ఫైళ్ల కట్టను గాల్లోకి విసిరేశాడు. ఆ కాగితాలన్నీ కోర్టు హాల్లో జడ్జీల మీదుగా చెల్లాచెదురుగా పడిపోయాయి. అంతటితో ఆగకుండా, భారత ప్రధాన న్యాయమూర్తిని ఉద్దేశించి కూడా నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించడం ప్రారంభించాడు.

**- బలవంతంగా ఈడ్చేసిన సెక్యూరిటీ..**

కోర్టు హాల్లో పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అక్కడ ఉన్న సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది వెనువెంటనే స్పందించారు. జడ్జీలపైకి దూసుకుపోకుండా అతడిని గట్టిగా పట్టుకుని, నియంత్రించి కోర్టు గది నుండి వెలుపలికి నెట్టేశారు. కోర్టు హాల్లో ఉన్న న్యాయవాదులు, ఇతర లిటిగెంట్లు ఈ హఠాత్పరిణామాన్ని చూసి షాక్‌కు గురయ్యారు.

**- పెద్ద మనసు చాటుకున్న ధర్మాసనం**

సాధారణంగా కోర్టు ధిక్కరణ లేదా న్యాయమూర్తులపై దాడికి ప్రయత్నిస్తే కఠినమైన జైలు శిక్షలు విధిస్తారు. అయితే, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సదరు వ్యక్తిపై ఎలాంటి కఠిన చర్యలకు లేదా కోర్టు ధిక్కరణ చర్యలకు నిరాకరించి పెద్ద మనసు చాటుకుంది. అతడిపై మేం ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనుకోవడం లేదు. ఆ పిటిషనర్ పట్ల మాకు కేవలం సానుభూతి మాత్రమే ఉంది అని జస్టిస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. అనంతరం కేసు రికార్డులను పరిశీలించి, హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి సరైన కారణాలు లేవంటూ సదరు స్పెషల్ లీవ్ పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది.

## హైదరాబాద్‌లో బోనాల సందడి

బోనాలు తెలంగాణ గంగా-జమున తెహజీబ్‌కు ప్రతీకగా పేర్కొన్నారు. హిందూ - ముస్లిం ఐక్యత దేశానికి ఆదర్శమని చెప్పుకొచ్చారు. గోల్కొండ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. జులై 16 నుంచి ఆగస్టు 13 వరకు బోనాల ఉత్సవాలు జరగనున్నాయని వెల్లడించారు. భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు.

బోనాల షెడ్యూల్ ను ఖరారు చేసారు. అందులో భాగంగా జులై 16 (తొలి బోనం): జగదాంబిక అమ్మవారికి సమర్పించే తొలి బోనంతో గోల్కొండ కోటలో అధికారికంగా వేడుకలు ప్రారంభమవుతాయి. అదే విధంగా జులై 19న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవానికి అంకురార్పణ జరుగుతుంది. జులై 26న నగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఆగస్టు 2న (లష్కర్ బోనాలు) సికింద్ రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పిస్తారు. ఆగస్టు 9న (పాతబస్తీ బోనాలు)గా చారిత్రాత్మక లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారితో పాటు పాతబస్తీలోని అన్ని ప్రధాన ముత్యాలమ్మ, మహంకాళి ఆలయాల్లో బోనాల జాతర జరుగుతుంది. ఇక, ఆగస్టు 10 నసికింద్రాబాద్ మరియు పాతబస్తీ ఆలయాల్లో అమ్మవారి భవిష్యవాణి (రంగం) వినడం, ఆ తర్వాత ఘటాల ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

## హరీష్ కాంగ్రెస్ లోకి వస్తానంటే..

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ - బీఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వం కొనసాగుతోంది. కాళేశ్వరం చుట్టూ రాజకీయం తిరుగుతోంది. రేవంత్ చేసిన సవాల్ కు హరీస్ స్పందిస్తూ తనకు ఇరిగేషన్ శాఖ అప్పగిస్తే సక్సెస్ చేస్తానని వెల్లడించారు. దీని పైన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పందించారు. హరీష్ కు ఆఫర్ ఇచ్చారు. హరీష్ కాంగ్రెస్ లోకి వస్తానంటే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.తెలంగాణ రాజకీయంలో బీఆర్ఎస్ - కాంగ్రెస్ నేతల మధ్య కాళేశ్వరం కేంద్రంగా సవాళ్లు కొనసాగుతున్నాయి.

సీఎం రేవంత్ కాళేశ్వరం విషయంలో కీలక వ్యాఖ్యలు చేసారు. కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వచ్చి కన్విన్స్ చేస్తే మూడేళ్లు ఆయనకే కాళేశ్వరం అప్పగిస్తానని చెప్పారు. దీని పైన హరీష్ స్పందించారు. కాళేశ్వరం నీటి వినియోగం పైన వివరించారు. కేసీఆర్ వరకు అవసరం లేదని, తనకు ఇరిగేషన్ శాఖ అప్పగిస్తే తానే నిర్వహించి చూపిస్తానని సవాల్ చేసారు. దీని పైన స్పందించిన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేసారు. హరీష్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామని చెప్పారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకునే అంశం పైన నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు.హరీష్ గతంలో ఇరిగేషన్ మంత్రిగా చేసారని పదేళ్లు ఏం చేయని వీరు మూడు నెలల సమయం ఇస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. అదే విధంగా తాజా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి వివాదం పైనా స్పందించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజంగా ఉంటాయని చెప్పారు. పార్టీ లో స్వేచ్ఛ ఉంటుందని దుర్వినియోగం చేస్తే చూస్తూ ఉండమని స్పష్టం చేసారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అ వివుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామని చెప్పిన మహేష్ గౌడ్, పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని చెప్పుకొచ్చారు . సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదని వ్యాఖ్యానించారు.

## మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రధాని మోదీ

ఆయన ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ఒక అపురూపమైన, అరుదైన బహుమతిని అందజేశారు. సుమారు 20 ఏళ్ల క్రితం మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్టీవ్ వా ఆయనను కలిసినప్పటి ఒక పాత ఫోటోను ప్రధాని ఈ సందర్భంగా బహుమతిగా ఇచ్చారు. రెండు దశాబ్దాల నాటి ఈ ప్రత్యేక జ్ఞాపకం ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేయగా ఈ అరుదైన కానుక పట్ల స్టీవ్ వా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.ప్రధాని మోదీ పర్యటన వేళ క్రీడా రంగంలో ఒక చారిత్రాత్మక ప్రకటన వెలువడింది. ఆస్ట్రేలియా బిగ్ బాష్ లీగ్ (బిబిఎల్) 2026-27 సీజన్ ఆరంభ మ్యాచ్ ఈ ఏడాది డిసెంబర్‌లో భారతదేశంలోని చెన్నై వేదికగా జరగనుందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ అధికారికంగా ప్రకటించారు. ఆస్ట్రేలియా వెలుపల ఒక అధికారిక బిబిఎల్ మ్యాచ్ జరగడం చరిత్రలో ఇదే తొలిసారి. భారత్ ఇంతకుముందు ఐపీఎల్ వంటి అనేక అంతర్జాతీయ లీగ్‌లకు ఆతిథ్యం ఇచ్చినప్పటికీ, ఒక విదేశీ దేశీయ క్రికెట్ లీగ్ భారత గడ్డపై అధికారిక మ్యాచ్‌ను నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ప్రారంభ మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్లు తలపడతాయని క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టం చేసింది.ఎంసిజి వేదికగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ మైదానంలోకి అడుగుపెట్టడం ఏ భారతీయుడికైనా ఒకేసారి రెండు భావోద్వేగాలను కలిగిస్తుందని అన్నారు. ఒకటి భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్సాహం అయితే, రెండవది మన రెండు దేశాలలో క్రికెట్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు, అది ఒక ఉమ్మడి అభిరుచి అనే గ్రహింపు అని స్పష్టం చేశారు. ఈ రోజు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటలోని ఆనందం, ఇరు దేశాల స్నేహంలోని ఆత్మీయత మాత్రమే ఇక్కడ కనిపిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. ఇదిలావుంటే, భారత క్రికెట్ నియంత్రణ మండలి మద్దతుతో, చెన్నై మ్యాచ్‌ను ఒకే ఒక్క ప్రత్యేక ఈవెంట్‌గా ప్లాన్ చేశారు. 2030 వరకు జియోస్టార్‌తో కుదిరిన మీడియా హక్కుల ఒప్పందం ద్వారా బిబిఎల్ ఇప్పటికే భారతదేశంలో ప్రసారం అవుతుండగా తాజా నిర్ణయంతో ఈ ప్రాంతం నుండి బాహ్య పెట్టుబడులను ఆకర్షించే అవకాశాన్ని కూడా క్రికెట్ ఆస్ట్రేలియా అన్వేషిస్తోంది.

## కరూర్ బాధితులకు అండగా సీఎం విజయ్

ఆయన ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కూడా తనదైన శైలిలో మన్ననలు పొందుతున్నారు. ఇప్పటికే దేవాలయాలు, మసీదులు, చర్చిలు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లకు 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం దుకాణాలు ఉండకూడదని ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో సైతం 2035 నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని ప్రకటించారు. ఇప్పుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని సర్వత్రా ప్రశంసలు పొందుతున్నారు.కాగా విజయ్ కరూరులో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో మొత్తం 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించారు. అయితే ఈ దుర్ఘటన జరిగి దాదాపు ఏడాది పూర్తవుతున్న తరుణంలో విజయ్ కరూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను ఆయన స్వయంగా అందజేశారు.ఈ మేరకు కరూర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాల్లోని అర్హులైన 32 మందికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను కేటాయించారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఎస్పీ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో నియామకాలు జరిగినట్టు తెలుస్తోంది. అనంతరం బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారని సమాచారం. అలానే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 10 లక్షల పరిహారం అందజేయగా టీవీకే పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి రూ. 20 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ ప్రమాదంలో భర్తను కోల్పోయిన నివేదిక అనే మహిళకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం లభించింది. ఈ నియామకం తమ కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మరో బాధితురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ తమ గోడు విని సీఎం కంటతడి పెట్టుకున్నారని పేర్కొన్నారు.ఇక ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ కరూర్ తొక్కిసలాట ఘటన తన జీవితంలో ఒక మాయని గాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దుర్ఘటన అత్యంత బాధాకరమైన అనుభవమని కన్నీటి పర్యంతం అయ్యారు. ఆనాటి ర్యాలీలో పోలీసుల భద్రతా ఏర్పాట్లను నమ్మానని అయితే ప్రజల నియంత్రణలో వైఫల్యాలు ఎందుకు చోటుచేసుకున్నాయని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా మృతుల జ్ఞాపకార్థం తమ పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

## రాములోరి మీద ఆన.. పాతాళానికి తొక్కేస్తాం!

సీట్లు సాధించి ఇక్కడ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. ఇప్పుడు అదే నమ్మకంతో ఖమ్మం గడ్డ పైనుంచి జోస్యం చెబుతున్నా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ 117 సీట్లు గెలవడం ఖాయం అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**కేసీఆర్ టార్గెట్‌గా కౌంటర్లు**

జగన్నాథపురం సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు అటు లీడర్లలో, ఇటు సోషల్ మీడియా వేదికలపై పెను దుమారం రేపుతున్నాయి. ముఖ్యంగా భద్రాచలం రాముడిపై ఒట్టేసి కేసీఆర్‌కు సవాల్ విసరడం, 2029 నాటికి తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 182కు పెరుగుతాయని కాన్ఫిడెంట్‌గా చెప్పడంపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. రైతు భరోసా నిధులు రూ. 1009 కోట్లు విడుదల సందర్భంగా జరిగిన ఈ రైతు ఆశీర్వాద సభ కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే కాకుండా, రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలకు వేదికగా మారింది. కేసీఆర్ ఫ్యామిలీని, బీఆర్ఎస్ శ్రేణులను పూర్తిగా నిరుత్సాహపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మక ప్రసంగం చేశారు. నియోజకవర్గాల విభజన బిల్లుపై కేంద్రం అడుగులు, 26 ఎంపీ స్థానాల పెంపు వంటి జాతీయాంశాలను రేవంత్ ప్రస్తావించడంతో రాబోయే రోజుల్లో తెలంగాణ పాలిటిక్స్ మరింత వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.


## వెదురు మొక్కల పెంపకంపై అవగాహన

**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో వెదురు మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఐకేపీ ఏపీఎం రాజన్న, సీసీ శశికాంత్ మాట్లాడుతూ.. రైతులు 15 గుంటల భూమిలో సుమారు 60 వెదురు మొక్కలను నాటి మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. వెదురు మొక్కలు మూడు సంవత్సరాల్లో కోతకు సిద్ధమవుతాయని, ప్రతి సంవత్సరం నిర్వహణ ఖర్చుగా 15 గుంటలకు రూ.15,000 చొప్పున అందించనున్నట్లు వివరించారు. కోతకు వచ్చిన వెదురు ద్వారా రైతులకు సంవత్సరానికి సుమారు రూ.50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# చరిత్రకు చిరునామా.. కళకు కిరీటం..

# అభివృద్ధికి దిక్సూచి



## కొండపల్లి  కోట, కళ, కీర్తి కలిసిన వారసత్వ నగరం

ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర, సంస్కృతి, కళ, ఆధునిక అభివృద్ధి ఒకే చోట కలిసిన అరుదైన ప్రాంతాల్లో కొండపల్లి ఒకటి. విజయవాడకు పశ్చిమంగా కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న చెక్కబొమ్మలతో ఎంత ప్రసిద్ధి చెందిందో, ఏడు శతాబ్దాల చరిత్రను తన ఒడిలో దాచుకున్న కొండపల్లి కోటతో అంతే విశిష్టతను సంతరించుకుంది. నేడు పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతూ గత వైభవాన్ని, నేటి ప్రగతిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోంది.

### కొండల నడుమ పుట్టిన చారిత్రక గ్రామం

కొండల మధ్య విస్తరించి ఉండటం వల్లే ఈ ప్రాంతానికి “కొండపల్లి” అనే పేరు వచ్చిందని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు తూర్పు తీర ప్రాంతాన్ని రాయలసీమ, తెలంగాణతో కలిపే కీలక వాణిజ్య, సైనిక మార్గం ఇక్కడి మీదుగానే వెళ్లేది. అందుకే అనేక రాజవంశాలు ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి పోటీపడ్డాయి. కొండపల్లి చరిత్ర అంటే దక్షిణ భారత రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం అని చెప్పాలి.





### ఏడు శతాబ్దాల చరిత్ర చెప్పే కొండపల్లి కోట

కొండపల్లి పేరు వినగానే గుర్తుకొచ్చే మరో గొప్ప చిహ్నం కొండపల్లి కోట. 14వ శతాబ్దంలో రెడ్డి రాజుల కాలంలో నిర్మాణం ప్రారంభమైన ఈ కోట తరువాత గజపతులు, విజయనగర సామ్రాజ్యం, గోల్కొండ కుతుబ్ షాహీలు, మొఘలులు, నిజాం పాలకులు, బ్రిటిష్ పాలకుల వరకు అనేక రాజవంశాల పాలనను చూసింది.ప్రతి రాజవంశం తమ అవసరాలకు అనుగుణంగా కోటను విస్తరించడంతో నేడు కనిపించే నిర్మాణ వైభవం ఏర్పడింది. భారీ రాతి ప్రాకారాలు, బలమైన బురుజులు, రహస్య మార్గాలు, రాజమందిర అవశేషాలు, వీక్షణ స్థలాలు నాటి శిల్పకళా నైపుణ్యాన్ని నేటికీ చాటుతున్నాయి. కోటపై నుంచి కనిపించే ప్రకృతి అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.



### ప్రపంచానికి పరిచయమైన కొండపల్లి బొమ్మలు

కొండపల్లికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చింది చెక్కబొమ్మల కళ. ప్రత్యేకమైన “పొనికి” చెక్కతో పూర్తిగా చేతిపనిగా తయారయ్యే ఈ బొమ్మలు శతాబ్దాలుగా తరతరాలుగా కళాకారుల కుటుంబాల్లో కొనసాగుతున్న జీవంతమైన సంప్రదాయం.
గ్రామీణ జీవనశైలి, రైతు కుటుంబాలు, దేవతామూర్తులు, జంతువులు, దసరా కొలువులు, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే అనేక రూపాల్లో ఈ బొమ్మలు రూపొందుతాయి. ఈ కళకు భౌగోళిక గుర్తింపు (+× ట్యాగ్) రావడంతో ప్రపంచవ్యాప్తంగా మరింత ఆదరణ పెరిగింది. విదేశాల నుంచి కూడా భారీగా ఆర్డర్లు రావడం ఈ కళకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.



### సవాళ్లను ఎదుర్కొంటున్న కళాకారులు

కాలంతో పాటు యంత్రాలతో తయారయ్యే వస్తువుల పోటీ పెరగడం, ముడి సరుకుల ధరలు అధికం కావడం, కొత్త తరం ఇతర ఉద్యోగాల వైపు వెళ్లడం వంటి కారణాలతో కొండపల్లి కళాకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ తమ పూర్వీకుల వారసత్వాన్ని కాపాడాలనే సంకల్పంతో వందలాది కుటుంబాలు ఈ కళను ఇప్పటికీ కొనసాగించడం విశేషం.

### పారిశ్రామిక ప్రగతికి చిరునామా

స్వాతంత్ర్యం తర్వాత కొండపల్లి మరో రూపాన్ని సంతరించుకుంది. విజయవాడ సమీపం, జాతీయ రహదారి, రైల్వే సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. కొండపల్లి--ఇబ్రహీంపట్నం పరిసరాల్లో పారిశ్రామిక వాడలు, గిడ్డంగులు, లాజిస్టిక్స్ కేంద్రాలు, విద్యాసంస్థలు, నివాస కాలనీలు ఏర్పడి ఈ ప్రాంతాన్ని కీలక ఆర్థిక కేంద్రంగా మార్చాయి.పారిశ్రామిక అభివృద్ధి వల్ల వేలాది మందికి ఉపాధి లభించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమైంది.

### పర్యాటకంగా కొత్త అవకాశాలు

ఇటీవలి కాలంలో కొండపల్లి కోట అభివృద్ధి, పర్యాటక సౌకర్యాల మెరుగుదల, బొమ్మల గ్రామ అభివృద్ధి, కళాకారులకు ప్రోత్సాహక కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

కోటను సందర్శించే పర్యాటకులు బొమ్మల గ్రామాన్ని కూడా సందర్శించడం వల్ల స్థానిక కళాకారులకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తోంది.చరిత్రను తెలుసుకోవాలనుకునే వారికి, హస్తకళలను ఆస్వాదించాలనుకునే వారికి, ప్రకృతి అందాలను వీక్షించాలనుకునే వారికి కొండపల్లి ఒకే చోట అన్ని అనుభూతులను అందించే అరుదైన పర్యాటక కేంద్రంగా మారుతోంది.

### విశ్లేషణ

కొండపల్లి ప్రత్యేకత ఒకే అంశంలో లేదు. ఏడు శతాబ్దాల చరిత్రను చెప్పే కోట.. ప్రపంచాన్ని ఆకట్టుకున్న చెక్కబొమ్మలు.. వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక అభివృద్ధి.. ఈ మూడు కలిసి కొండపల్లిని ఆంధ్రప్రదేశ్ వారసత్వానికి ప్రతీకగా నిలబెట్టాయి.అయితే ఈ వైభవం తరతరాలకు అందాలంటే కొండపల్లి కోట సంరక్షణకు మరింత నిధులు, చెక్కబొమ్మల కళాకారులకు ఆర్థిక భరోసా, యువతకు ప్రత్యేక శిక్షణ, అంతర్జాతీయ మార్కెటింగ్, పర్యాటక మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

### ముగింపు

చరిత్రను గుండెల్లో దాచుకుని.. కళను ప్రపంచానికి పరిచయం చేస్తూ.. ఆధునిక అభివృద్ధిని ఆహ్వానిస్తూ ముందుకు సాగుతున్న కొండపల్లి నేడు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ వారసత్వ క్షేత్రంగా నిలిచింది. కోటకు కీర్తి, బొమ్మలకు ప్రపంచ ఖ్యాతి, అభివృద్ధికి నూతన దిశ చూపుతున్న కొండపల్లి నిజంగా “చరిత్రకు చిరునామా.. కళకు నిలయం.. అభివృద్ధికి ప్రతీక” అనే పేరుకు పూర్తిగా న్యాయం చేస్తోంది.

---

## యాదగిరిగుట్టలో ఏకాదశి వేడుకలు

# స్వామివారికి లక్ష పుష్పార్చన



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట  లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్షపుష్పార్చన ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుప్రభాతంతో గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలతో నిజాభిషేకం జరిపించారు.

అనంతరం తులసి దళాలతో సహస్ర నామార్చనలు చేసి ప్రధాన ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో, ముత్యాల తళంబ్రాలతో, బంగారు ఆభరణాలతో దివ్య మనోహరంగా బంగారు సింహాసనంపై అలంకరించారు. అనంతరం అర్చక బృందం, వేద పండితులు.. స్వామి, అమ్మవార్లను సహస్రనామ పఠనాలతో, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. రెండు గంటల పాటు అర్చన కొనసాగింది. అనంతరం ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి యాగశాలలో రుద్రహవనం పద్ధతిలో నిర్వహించారు.

### కుమారుడి జన్మదినం సందర్భంగా దుర్గమ్మను దర్శించుకున్న

# హోంమంత్రి వంగలపూడి అనిత



విజయవాడ(ప్రశ్న న్యూస్) రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తన కుమారుడు నిఖిల్ జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయాన్ని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కుటుంబం, నిఖిల్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సకల శుభాలు కలగాలని దుర్గమ్మ తల్లిని ప్రార్థించింది. ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ అర్చకులు మంత్రి వంగలపూడి అనిత కుటుంబానికి వేదాశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం మంత్రి కుటుంబ సభ్యులు ఆలయ అధికారులతో కొద్దిసేపు మాట్లాడి ఆలయ ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. అనంతరం దుర్గమ్మ ఆశీస్సులు తీసుకుని ఆలయం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

# వరాహి నవరాత్రుల సందర్భంగా వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

### గాజువాక వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు



గాజువాక,(ప్రశ్న న్యూస్) వరాహి దేవి నవరాత్రుల సందర్భంగా గాజువాక 65వ వార్డు వాంబే కాలనీలోని శ్రీశ్రీశ్రీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ప్రతి శుక్రవారం లక్ష్మీదేవిని వారాహి మాత రూపంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రోంపిచర్ల శ్రీనివాసాచార్యులు ప్రత్యేక అలంకరణ చేసి వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, వారాహి అమ్మవారు హిందూ శాక్త, తాంత్రిక సంప్రదాయాల్లో అత్యంత శక్తివంతమైన దేవతలలో ఒకరని, ఆమెను శ్రీమహావిష్ణువు వరాహావతార శక్తి స్వరూపిణిగా భావిస్తారని తెలిపారు. పంది ముఖంతో, వివిధ ఆయుధాలను ధరించిన వారాహి దేవి శత్రు సంహారిణిగా, భక్తులకు రక్షణ కల్పించే దైవంగా ఆరాధించబడుతుందని వివరించారు. వారాహి అమ్మవారి అనుగ్రహంతో భయాలు, దుష్టశక్తుల ప్రభావం తొలగి ధైర్యం, శక్తి, విజయం, ఐశ్వర్యం లభిస్తాయని భక్తుల విశ్వాసమన్నారు. నిత్యం భక్తిశ్రద్ధలతో ఆమెను ఆరాధించే వారికి జీవితంలో సానుకూల మార్పులు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు, ఆలయ సేవకులు, మహిళా భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# జీడి ఉత్పత్తి పెంపు

## విలువ ఆధారిత పరిశ్రమలే లక్ష్యం

- ఎమ్మెల్యే గౌతు శిరీష
- పలాసలో జీడి ఆధారిత పరిశ్రమల అభివృద్ధిపై విస్తృత స్థాయి చర్చ



పలాస (ప్రశ్న న్యూస్) పలాస నియోజకవర్గంలో జీడి ఉత్పత్తిని మూడు రెట్లు పెంచడంతో పాటు జీడి ఆధారిత విలువ ఆధారిత పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధ్యక్షతన శుక్రవారం ఆమె కార్యాలయంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సార్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జీడి సాగు విస్తరణ, రైతుల సమస్యలు, పరిశ్రమల అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో టెక్కలి హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, పలాస కాజు మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, జీడి పరిశ్రమల యజమానులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీదారులు, ఎస్సార్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. జీడి ఉత్పత్తి పెంపులో విజయవంతమైన మహారాష్ట్రలోని రత్నగిరి మరియు కేరళ రాష్ట్రాల నమూనాలను అధ్యయనం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం ఒక రైతు, ఒక పరిశ్రమ యజమాని, ఒక పారిశ్రామికవేత్తతో కూడిన బృందాన్ని ఆయా ప్రాంతాలకు పంపించి అక్కడి విధానాలను పరిశీలించి పలాసలో అమలు చేసే అవకాశాలను పరిశీలించనున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, "ఉద్యోగ అవకాశాలు పెరగాలంటే పరిశ్రమలు రావాలి. పరిశ్రమలు రావాలంటే పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించాలి. అయితే పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలకు కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వదు" అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం "ప్రతి చేనుకు నీరు – ప్రతి చేతికి పని" అనే లక్ష్యంతో పనిచేస్తోందని, వ్యవసాయం బలోపేతం కావడంతో పాటు పరిశ్రమలు అభివృద్ధి చెందితేనే స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా పలాసలో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జీడితో పాటు జీడి తొక్కను ఉపయోగించి బై-ప్రొడక్ట్స్ తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఎస్సార్ కంపెనీ ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ ప్రణాళిక అమలైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పలాస ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలాస టీడీపీ సమన్వయకర్త వెంకన్న చౌదరి, ఎస్సార్ కంపెనీ ప్రతినిధులు సాయిక్ అప్పారావు, హృషికేశ్ పరంజిత్, అరుణ్ రంజన్, ఏఎంసీ చైర్మన్, పలాస కాజు పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ఆటోమోటివ్ ఈవీ ఎకో సిస్టమ్‌కు వేగం

### పుంగనూరులో ఈవీ క్లస్టర్ - ప్రతి 30 కి.మీ.లకు ఛార్జింగ్ స్టేషన్

### కొరియా ఆటో పరిశ్రమలను పెట్టుబడులకు ఆహ్వానించిన మంత్రి నారా లోకేశ్





సియోల్ (ప్రశ్న న్యూస్) సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ-4.0 కింద ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర ఆటోమోటివ్ ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రక్రియలో దక్షిణ కొరియా సంస్థలు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ ఛైర్మన్ టేక్-సుంగ్ లీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేష్, ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న ఈవీ రంగ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని పూర్తి ఏపీఎస్ఆర్టీసీ బస్సు వ్యవస్థను దశలవారీగా విద్యుదీకరించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రీన్ కారిడార్ల వెంట ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఈవీ ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పుంగనూరులో ప్రత్యేక ఈవీ క్లస్టర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఈ-మొబిలిటీ నగరాలకు ప్రత్యేక పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) గ్రాంట్లు అందించనున్నట్లు వెల్లడించారు. ఈవీ మాగ్నెట్ల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ ఖనిజాల వినియోగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో 100 కిలోమీటర్ల వ్యాసార్థంలో ఆటోమోటివ్ విడిభాగాల తయారీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కియా మోటార్స్ విజయాన్ని రాష్ట్ర పారిశ్రామిక విధానానికి నిదర్శనంగా పేర్కొన్న మంత్రి, అనంతపురంలోని కియా ప్లాంట్ సమీపంలో ఒక ప్రత్యేక ఆటో కాంపోనెంట్ పార్క్, శ్రీసిటీ-చిత్తూరు-తిరుపతి కారిడార్‌లో మరో ప్రత్యేక కొరియన్ ఆటో కాంపోనెంట్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పార్కుల్లో ప్లగ్ అండ్ ప్లే షెడ్లు, ఉమ్మడి టెస్టింగ్, టూలింగ్ సదుపాయాలు, కొరియా పెట్టుబడిదారులకు ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అశోక్ లేలాండ్, ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి ప్రముఖ సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. అశోక్ లేలాండ్ సంస్థ రూ.2,500 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, ఈవీ పవర్‌ట్రెయిన్‌ల కోసం ప్రత్యేక అకాడమీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 250కిపైగా ఇంజినీరింగ్ కళాశాలలతో కలిసి కొరియన్ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్య కలిగిన మానవ వనరులను తయారు చేసేందుకు కొరియా సంస్థలు ముందుకు రావాలని ఆహ్వానించారు. దక్షిణ కొరియా-ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఏపీ ఆర్థికాభివృద్ధి బోర్డు లో ప్రత్యేక కొరియా డెస్క్‌తో పాటు ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ ప్రకటించారు.

# చట్టాలను అపహాస్యం చేసే వారిని జగన్ సమర్థిస్తున్నారు

### :ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

మంగళగిరి(ప్రశ్న న్యూస్) వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన పార్టీ అనుసరిస్తున్న విధానాలపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర విమర్శలు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అలజడి సృష్టించే, చట్టాలను గౌరవించని వ్యక్తులకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా 'రావణ్' అనే వ్యక్తికి జగన్ ఏ కారణంతో మద్దతు తెలుపుతున్నారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టం, రాజ్యాంగం, పోలీసు వ్యవస్థ, మహిళల పట్ల గౌరవం లేని వ్యక్తులను సమర్థించడం వైఎస్సార్‌సీపీ రాజకీయ వైఖరికి నిదర్శనమని అన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులకు జగన్ అండగా నిలుస్తున్నారని విమర్శించారు. నెలనెలా పారితోషికాలు ఇచ్చి కొందరిని సోషల్ మీడియా కార్యకర్తల పేరుతో సమాజంలో అశాంతి సృష్టించేలా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తుంటే, దానిని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని, పోలీసు వ్యవస్థ కూడా శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. పోలీసు అధికారులను పేరుపేరునా విమర్శించడం, బెదిరింపులకు పాల్పడటం బాధ్యతాయుత రాజకీయాలకు విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై ప్రభుత్వం చట్టప్రకారం వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజల్లో బలం కోల్పోయి సోషల్ మీడియా ప్రచారాలకే పరిమితమైందని విమర్శించిన ఎంపీ, గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన తీర్పు ఇచ్చారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు ఎన్డీఏ కూటమికి మద్దతు ఇచ్చి వైఎస్సార్‌సీపీని పూర్తిగా తిరస్కరిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గమనిక: పై కథనం టీడీపీ కేంద్ర కార్యాలయంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు నిర్వహించిన



మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలు, వ్యాఖ్యల ఆధారంగా రూపొందించబడింది. సంబంధిత అంశాలపై వైఎస్సార్‌సీపీ స్పందన ఇందులో పొందుపరచబడలేదు.

# ఎన్‌టీఆర్ గార్డెన్, లుంబిని పార్క్ కాంటీన్ల కేటాయింపుల్లో పారదర్శకత ఎక్కడ.?

- అద్దె వివరాలు, చెల్లింపుల లెక్కలు బహిర్గతం చేయాలని డిమాండ్
- టెండర్ లేకుండా కేటాయింపులపై ప్రజల ప్రశ్నలు
- హెచ్ఎండిప బుద్ధపూర్ణిమ అధికారుల మౌనం ఎందుకు.?






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన ఎన్‌టీఆర్ గార్డెన్, లుంబిని పార్క్ కాంటీన్ల కేటాయింపులు, అద్దె వసూళ్లు, చెల్లింపుల లెక్కలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ఆస్తులకు సంబంధించిన వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉండాల్సిన సమయంలో కీలక వివరాలు ఇప్పటికీ బహిర్గతం కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. హెచ్ఎండిఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు అధికారులు ఈ అంశాలపై పూర్తి సమాచారాన్ని ప్రజల ముందుంచాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమాచారం ప్రకారం కరోనా మహమ్మారికి ముందు ఎన్‌టీఆర్ గార్డెన్ క్యాంటీన్ ను మస్కట్ టీ సంస్థకు కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే ఆ కేటాయింపు ఏ నిబంధనల మేరకు జరిగింది, నెలవారీ అద్దె ఎంత నిర్ణయించారు, ఒప్పంద కాలపరిమితి ఎంత, కాంట్రాక్టు అమలులో ఉన్న సమయంలో మొత్తం ఎంత అద్దె చెల్లించారు, ప్రస్తుతం బకాయిలు ఏమైనా ఉన్నాయా వంటి వివరాలు అధికారికంగా ఎక్కడా అందుబాటులో లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా ఆస్తుల వినియోగానికి సంబంధించిన ప్రతి రూపాయి లెక్క ప్రజలకు తెలిసేలా అధికారులు పూర్తి చెల్లింపుల స్టేట్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. అదే విధంగా లుంబిని పార్క్ క్యాంటీన్ ను బూమరాంగ్ పేరుతో నిర్వహించినట్లు సమాచారం. ఆ సంస్థ నిర్వహణలో ఉన్న కాలంలో ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థకు ఎంత అద్దె చెల్లించింది, నెలవారీ చెల్లింపుల వివరాలు ఏమిటి, ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలు ఎలా ఉన్నాయనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు హెచ్ఎండిఏ బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అధికారులను కోరుతున్నారు. ఐదు నెలల క్రితమే బూమరాంగ్ నిర్వహణ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఆ తేదీ వరకు జరిగిన అన్ని ఆర్థిక లావాదేవీలను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ప్రస్తుతం అదే క్యాంటీన్ ను సాయిబాబా పేరుతో టెండర్ నిర్వహించకుండా కేటాయించారనే ఆరోపణలు మరింత చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ నిర్వహించారా.? లేదా.? అనే అంశంపై స్పష్టత లేకపోవడం పలు అనుమానాలకు కారణమవుతోంది. ఒకవేళ టెండర్ లేకుండా కేటాయించి ఉంటే దానికి చట్టబద్ధమైన ఆధారం ఏమిటి, ఎంత కాలానికి ఒప్పందం కుదిరింది, ప్రస్తుతం నెలవారీ అద్దె ఎంత, ఇప్పటి వరకు ఎంత మొత్తం చెల్లించారు, బకాయిల పరిస్థితి ఏమిటి, ఒప్పంద నిబంధనలు ఎలా ఉన్నాయనే ప్రశ్నలకు హెచ్ఎండిఏ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, సమాన అవకాశాలే ప్రభుత్వ పాలనకు ప్రమాణాలుగా ఉండాలి. కేటాయింపుల ప్రక్రియపై ఎలాంటి సందేహాలకు తావులేకుండా అన్ని ఒప్పందాలు, టెండర్ వివరాలు, అద్దె లెక్కలు, చెల్లింపుల స్టేట్‌మెంట్‌లు, బకాయిల వివరాలను హెచ్ఎండిఏ బుద్ధపూర్ణిమ అధికారులు వెంటనే బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఈ వ్యవహారంపై మరిన్ని అనుమానాలు వ్యక్తమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## రోడ్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు ఇసుక లారీల రవాణా నిలిపివేయాలి: సీపీఎం

**రోడ్ల దుస్థితితో బస్సులు నిలిపివేత ఆలోచనలో ఆర్టీసీ**



వెంకటాపురం( ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా వెంకటాపురం-చర్ల ప్రధాన రహదారిపై మరమ్మతులు పూర్తయ్యే వరకు చర్ల నుంచి ఇసుక లారీల రవాణాను పూర్తిగా నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో చిట్టెం ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా వెంకటాపురం-చర్ల ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధే లక్ష్యమని చెప్పుకునే ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు రోడ్ల సమస్యపై ప్రజలను మాటలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. రోడ్ల దుస్థితిపై ఎమ్మెల్యే నోరు మెదపకుండా ఒక ప్రెస్మీట్తో చేతులు దులుపుకున్నారని, రోడ్ల మరమ్మతులకు నిధులు ఎక్కడివరకు వచ్చాయో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గతంలో చర్ల ఇసుక లారీలు వెంకటాపురం మీదుగా వస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకటించిన హామీ ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికే రోడ్లు అధ్వాన్నంగా ఉండగా పక్క జిల్లాల నుంచి వేలాది ఇసుక లారీల రాకపోకలు కొనసాగించడం సమంజసం కాదన్నారు. రోడ్లు-భవనాల శాఖ ఉన్నతాధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండలంలోని 45 కిలోమీటర్ల ప్రధాన రహదారి ఇసుక లారీల రాకపోకలతో గుంతలమయంగా మారిందని, వర్షపు నీటితో గుంతలు కనిపించక ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. అత్యవసర సేవలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, గర్భిణీలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రోడ్ల దుస్థితి కారణంగా భద్రాచలం ఆర్టీసీ డిపో అధికారులు బస్సు సర్వీసులను నిలిపివేసే ఆలోచనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలందరూ కలిసి వస్తేచర్ల ఇసుక లారీలను అడ్డుకుంటామని గ్యానం వాసు హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శీను, మండల కమిటీ సభ్యులు కంతం సత్యం, గుండమల్ల ప్రసాద్, బోగట విజయకుమార్, సాధన, పెల్లి దేవి, సుహాసిని, శీను, మాణిక్యం, కట్ట మహేశ్వరరావు, సత్యవతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు

## నలుగురి ప్రాణాలు కాపాడిన రాయ్‌పోల్ పోలీసులు

**సమయస్పూర్తితో స్పందించిన కానిస్టేబుళ్లను**

**అభినందించిన సీపీ రష్మీ పెరుమాల్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గృహ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై తన ముగ్గురు చిన్నారులతో కలిసి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను రాయ్‌పోల్ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి సురక్షితంగా కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సిద్దిపేట జిల్లా రాయ్‌పోల్ మండలం తిమ్మాక్కపల్లి గ్రామానికి చెందిన 28 ఏళ్ల మహిళకు తన అత్తతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తన ముగ్గురు కుమారులు (7 సంవత్సరాలు, 3 సంవత్సరాలు, 9 నెలల పసికందు)తో కలిసి గ్రామ సమీపంలోని బావి వద్దకు వెళ్లింది. మహిళ పిల్లలతో కలిసి అనుమానాస్పదంగా వెళ్లడాన్ని గమనించిన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వెంటనే డయల్--100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రాయ్‌పోల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు ఎన్. ప్రశాంత్ మల్లేష్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మహిళతో మాట్లాడి, ఆమెను పిల్లలతో సహా సురక్షితంగా బయటకు తీసుకొచ్చి నలుగురి ప్రాణాలను కాపాడారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి నలుగురి ప్రాణాలను రక్షించిన కానిస్టేబుళ్లు ఎన్. ప్రశాంత్, మల్లేష్‌లను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్--100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకోకుండా, ఎలాంటి కుటుంబ లేదా వ్యక్తిగత సమస్యలకైనా కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అనాథ శరణాలయం నిర్మాణానికి భూమిపూజ

**ముఖ్య అతిథిగా హాజరైన : గజ్వేల్ సీఐ రవికుమార్**



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో "నేను సైతం సమాజానికి సేవ చేద్దాం" చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న అనాథ శరణాలయానికి శుక్రవారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ సీఐ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ, సమాజంలో దిక్కులేని అనాథలకు ఆశ్రయం కల్పించే లక్ష్యంతో "నేను సైతం సమాజానికి సేవ చేద్దాం" చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చి అనాథ శరణాలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్ చైర్మన్ సర్దార్ పంజాల వెంకట్ గౌడ్ మాట్లాడుతూ, "మానవసేవే మాధవసేవ" అనే భావనతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, అనాథలకు శాశ్వత ఆశ్రయం కల్పించాలనే ఉద్దేశంతో ఈ శరణాలయ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. అలాగే, గతంలో శరణాలయ నిర్మాణం కోసం సీఐ రవికుమార్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ప్రస్తుతం నిర్మాణానికి అవసరమైన పునాది రాళ్లను తనవంతు సహాయంగా అందజేస్తానని హామీ ఇవ్వడం పట్ల ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సౌజన్య, పవిత్ర, ట్రస్ట్ సభ్యులు హరిప్రసాద్, వేముల శివకుమార్, మహేష్, పురోహితుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంతి ఉద్యోగుల పెన్షన్ల ప్రాబ్లమ్స్:దేవమ్మ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో యువత కన్న వయో వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వయస్సు మీద పడిన సీనియర్స్ సిటిజన్స్ ప్రభుత్వ శాఖల్లో వివిధ విభాగాల్లో సేవలు అందించి విశ్రాంతి ఉద్యోగులుగా మారారు. మిగిలిన వయో వృద్ధులు చిన్న పాటి వ్యాపారాలు, దినసరి కూలీలుగా ఉన్నవారు సైతం ఇందిలో ఉన్నారు. కానీ ఇతర దేశాల్లో వయస్సు మీద పడిన వాళ్లకి ప్రభుత్వాలు ఓ ప్రత్యేకమైన సెల్ నుంచి బాగోగులు చూసుకుంటున్నారు. అదే మన దేశంలో అలాంటి సేవలు అందించ లేకపోతున్నారు. మరీ ముఖ్యంగా నిరుపేద కుటుంబంలో ఆర్థిక సమస్యలు వల్ల, పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. సికింద్రాబాద్, బేగం పేట జిహెచ్ఎంసి సర్కిల్ ల్లో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు సకాలంలో పెన్షన్ చెల్లించడం లేదంటూ హరిహర కళాభవన్ లోని పెన్షన్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు నిరసనకు దిగారు. ఇటీవల నగరవ్యాప్తంగా నూతన మున్సిపల్ కార్పొరేషన్ల ఏర్పాటులో రెండు నెలలుగా పెన్షన్ డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు బాధితులు పేర్కొన్నారు. గతంలో బేగంపేట సర్కిల్ పరిధిలోకి వచ్చే 300 మందికి పైగా ఉన్న పెన్షనర్లను సమీప సర్కిల్లోకి మార్చారని అధికారులు చెప్పడంతో పెన్షనర్లు అయోమయానికి గురవుతున్నట్లు వెల్లడించారు. దశాబ్దాల పాటు జిహెచ్ఎంసిలో సేవలందించిన తమకు విశ్రాంత ఉద్యోగులుగా సరైన గౌరవం లభించడం లేదని దేవమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వృధాప్యంలో ఉన్న తమ పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ పరిస్థితిని గమనించి కార్యాలయాలు చుట్టూ తిప్పకుండా వెంటనే పెన్షన్ డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు. అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వయోవృద్ధుల విషయంలో తాత్సారం తగదన్నారు. పెన్షన్ డబ్బులు చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వెంకట స్వామి హెచ్చరించారు.

### విశ్రాంతి ఉద్యోగులకు సైతం తప్పని ఇబ్బందులు :

గతంలో బేగం పేట, సికింద్రాబాద్ :29,మున్సిపల్ కార్యాలయం :30 లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించిన కార్మికులు. గత(కొన్నేళ్ల క్రితం వందల మంది ఉద్యోగులు పదవి విరమణ చేశారు. సుమారు :320 మంది ఉద్యోగులకు గత రెండు మూడు మాసాలు నుంచి పెన్షన్లు రాక నానా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత పదిహేను రోజులుగా విశ్రాంతి ఉద్యోగులు సర్కిల్ :3,29 చూట్టు ప్రదర్శనలు చేస్తున్నప్పటికీ సరైన సమాధానం అధికారులు నుంచి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వెంకట స్వామి:విశ్రాంతి ఉద్యోగి:

గత కొంత కాలం క్రితం సికింద్రాబాద్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహించే వెంకటస్వామి. రిటైర్మెంట్ అనంతరం ఇంటికి పరిమితం అయ్యారు. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా వెంకట స్వామికి పెన్షన్ రాకపోవడంవల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయి. వయస్సు మీద పడిన తనకు కొన్ని రుగ్మతలతో బాధపడుతున్న విషయాన్ని వెల్లడించారు. అలిగే తన పిల్లల పిల్లలు తాతా అంటూ చెయ్యి చాపుతే తన వద్ద కనీసం పది రూపాయలు కూడా లేవంటూ కన్నీటిపర్యంతమయ్యారు. "2"మాసాలుగా మందులు కొనుగోలు చేయడానికి పైసలు లేక గుర్తున్న వారి దగ్గర అప్పు చేసి ఔషధాలు కొనుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇంత దయనీయమైన పరిస్థితిలో జీవితాన్ని గడుపుతున్న తమకు, మానవత దృక్పథంతో అధికారులు యుద్ధప్రాతిపదికన సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలోనే పెన్షన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే గడిచిన రెండు నెలల పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వివిధ విభాగాల్లో సేవలు అందించిన విశ్రాంతి ఉద్యోగులు కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# కాళేశ్వరం పై రాజకీయం వద్దు రైతాంగామే ముద్దు:ఈటెల

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయాలను పక్కనపెట్టి నష్టపోతున్న రైతాంగానికి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు,రైతుల శ్రేయస్సే తమకు ముఖ్యమని రైతులు నష్టపోయే పరిస్థితి ఉంటే ఊరుకునేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. కన్నెపల్లి పంపు హౌస్ నుండి నీటిని ఎల్లంపల్లి వరకు ఎత్తిపోస్తే రైతులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు. రైతాంగం కోసం మాట్లాడుతున్న నాపై అనేకమంది ఆరోపణలు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడమే తప్పని ప్రచారం చేయడం శోచనీయమని అన్నారు.ఎల్ నినో వల్ల భయంకర కరువు వచ్చే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకుని ఉత్తర తెలంగాణ రైతాంగానికి జంట నగరాల ప్రజలకు నీటి లభ్యత విషయంలో చర్యలు చేపట్టాలని సూచించారు. భాజాపా బి.అర్.ఎస్ ఒక్కటేనని చెప్తున్న రేవంత్ రెడ్డి కుర్చీ కింద నీళ్లు వస్తాయనేది తెలుసుకోవలన్నారు. రాబోయే ఎన్నికల్లో భాజపా సత్తా ఏంటో చూపిస్తామని, గొప్ప గొప్ప ప్రగల్ బాలు పలికిన నాయకులే కాలగర్భంలో కలిసిపోయారని చెప్పారు.



### ఎంపీ ఈటల రాజేందర్ ప్రెస్ మీట్

భారతదేశం వ్యవసాయ దేశం.మన ఆదాయం దానిమీద ఆధారపడి ఉంది. నూటికి 60 శాతం ప్రజలు గ్రామాల్లో ఉన్నారు.వారి జీవితం వ్యవసాయానికే అంకితం, తెలంగాణ ప్రభుత్వం నీళ్లు ఇవ్వకపోతే రైతులు ఇబ్బంది పడతాయి. అలాగే బహుళార్థ సాధక ప్రాజెక్టు నీటిపారుదల శాఖ మంత్రిలు భేషజాలు బంద్ చేసి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తమంగా ఆలోచన చేయండన్నారు. ఈటెలంటే తెలంగాణ మట్టి బిడ్డ, ఉద్యమకారున్నిఅదే నా గుర్తింపురాజకీయాల కోసం తెలంగాణ ప్రజలకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోనుచీల్చి చెండాడుతా. అలిగే నేను కాంగ్రెస్ పార్టీని ఇంకో పార్టీని తిట్టడానికి రాలేదు. పని చేయాల్సిన వారిని అడుగుతున్న.దేవాదులకు వంతెన లేదు, అందుకనే నీళ్ళు పంపు చేస్తున్నారు. మేడిగడ్డలో నీళ్ళు నింపమని అడగడం లేదు. ఉన్న నీళ్లను పంప్ చేయమని అడుగుతున్నాం.రాజకీయాలు చేసి రైతులను ఇబ్బంది పడితే ఖబర్దార్.మరో నలఫ్మై ఐదు రోజుల వరకే జంటనగరాల ప్రజల దాహార్తిని తీర్చే నీళ్ళు ఉండడం బాధాకరం. హైదరాబాద్ కి ఇప్పుడే 107 ఎంజిడి నీళ్ల సరఫరా తక్కువ ఉంది. ఒకవేళ నీటి కొరత వస్తె ఎటు పోవాలి. నువ్వు మేధావివి కావొచ్చు.కానీ ప్రజలు దుఃఖిస్తున్నారు. నీ ప్రభుత్వం తప్పు చేస్తుందని ప్రజలు అంటున్నారు. హైదరాబాద్ ప్రజానీకాన్ని ఉత్తర తెలంగాణ ఖమ్మం నల్లగొండ ప్రజలను మీరు బోనులో నిలబెడుతున్నారు.

సిఎం నిహెచ్చరించిన ఈటెల బీజేపీ ఏం చేయబోతుంది నీకిందికి నీళ్లు వచ్చినప్పుడు తెలుస్తుంది. గతం తెల్సుకోమాజీ సిఎం కేసిఆర్ ఎలా ఖతం అయ్యిండు గుర్తు చేసుకో.సందర్భమోస్తే పాతాళంలో పాతర వేస్తారు. ఇంజనీర్లతో మాట్లాడి పనులు చేయించు విమర్శలు బంద్ చెయ్.చుక్క నీరు నిలవచేయకండి.నదిలో పోయే నీటిని ఎత్తిపోస్తే సమస్య పరిష్కారం అవుతుంది.మరో విషయం ఏమిటంటే కాళేశ్వరం అవినీతిని బయట పెట్టు, భాధ్యున్ని తేల్చి అరెస్ట్ చేయండి.అంతే తప్ప రాజకీయాలకోసం ప్రజలను, రైతులను ఇబ్బంది పెట్టొద్దు.కాళేశ్వరం కట్టిన డబ్బులు ప్రజలవి.వాటిని వృథా చేయవద్దని విజ్ఞప్తి చేశారు.కాళేశ్వరం అవినీతి డబ్బులు రికవరీ చేయండి.మేము అడుగుతుంది నీళ్ళు ఎత్తిపోయండి అంతే.నన్ను కాల్చి చంపుతా అన్నా నేను ప్రజల విషయంలో రాజీపడను.మేడిగడ్డలో నీళ్ళు నిలపకుండానే, ఎత్తిపోయవచ్చు అర్థం చేసుకోండి సిఎం.మరో విషయం ఏకే 47 తీసుకొచ్చి కణత మీద పెట్టినా ఈటల రాజేందర్ రాజీ పడడు.ధర్మం కోసం ప్రజల కోసం ఎంతకైనా తెగిస్తారు.ఇప్పటికైనా ప్రభుత్వం నిద్ర లేచి రైతన్న కష్టాలు తీర్చాలని కోరారు.ఈకార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా,మల్లికార్జున్ భాజపా సీనియర్ నాయకులు, మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్, విజయరామరాజు,వైశాలిని రవి తదితరులు పాల్గొన్నారు.

## నాడు పరిశ్రమల పేరుతో భూ దోపిడీ,

**నేడు పరిశ్రమలతో ఉపాధి విప్లవం**

**వైఎస్సార్‌సీపీ పాలనపై తీవ్ర విమర్శలు చేసిన : కొమ్మారెడ్డి పట్టాభిరామ్**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిశ్రమల పేరుతో భూ దోపిడీ జరిగిందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో పారదర్శక పారిశ్రామిక విధానాలతో పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్నాయని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కడప జిల్లా జమ్మలమడుగు వద్ద బ్రాహ్మణి స్టీల్స్‌కు వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అత్యంత తక్కువ ధరకు కేటాయించారని, పరిశ్రమల ఏర్పాటు పేరుతో ప్రజా ఆస్తులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అనంతరం ఆ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పకపోవడంతో పాటు ఉద్యోగాలూ కల్పించలేదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియ ద్వారా ఆ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చిందని, అదే ప్రాంతంలో జిందాల్ సంస్థ సహకారంతో కొత్త స్టీల్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. గతంలో భూముల కేటాయింపులు అవినీతికి వేదిక కాగా, ఇప్పుడు పారదర్శక విధానాలతో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నామని అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటనల ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, బీపీసీఎల్, కియా వంటి సంస్థల పెట్టుబడుల ద్వారా లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. బ్రాహ్మణి స్టీల్స్, ఓబులాపురం మైనింగ్, 'క్విడ్ ప్రో కో' పెట్టుబడులకు సంబంధించి గతంలో నమోదైన సీబీఐ, ఈడీ కేసులను ప్రస్తావిస్తూ, వాటిపై కోర్టుల్లో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ అంశాలపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## రెండేళ్లలో రూ.1.17 లక్షల కోట్ల సంక్షేమం అందించాం

**- కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిపై**

**- నీలాయపాలెం విజయ్‌కుమార్**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందని, కేవలం 12 ప్రధాన పథకాల ద్వారానే రూ.1.17 లక్షల కోట్లకు పైగా ప్రజలకు లబ్ధి చేకూర్చామని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ), సామాజిక పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహనిర్మాణం, అంగన్‌వాడీ పోషకాహారం వంటి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. సామాజిక పెన్షన్లను నెలకు రూ.4,000కు పెంచి, రెండేళ్లలో రూ.68,194 కోట్లకు పైగా పంపిణీ చేశామని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక సామాజిక పెన్షన్ అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని అన్నారు. రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.12,000 కోట్లకు పైగా సాయం అందించామని తెలిపారు. విద్యార్థుల కోసం 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతి అర్హ విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం, దీపం--2 గ్యాస్ సబ్సిడీ, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక సాయం, అన్నా క్యాంటీన్ల నిర్వహణ వంటి కార్యక్రమాలకు భారీగా నిధులు కేటాయించామని వివరించారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ ఫీజుల బకాయిలను వదిలివెళ్లిందని ఆరోపించిన విజయ్‌కుమార్, కూటమి ప్రభుత్వం వాటిని చెల్లిస్తూ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడుతోందన్నారు. అలాగే గత ప్రభుత్వం రాష్ట్రంపై భారీ అప్పుల భారం మోపిందని, ప్రస్తుతం ఆ అప్పులపై వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు.

# 'లెనిన్' - మూవీ రివ్యూ!

అఖిల్ హీరోగా చేసిన సినిమానే 'లెనిన్'. సితార నాగవంశీ – నాగార్జున సంయుక్తంగా నిర్మించిన సినిమా ఇది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. భారీ విజయానికి చేరువకోవడానికి ప్రయత్నిస్తున్న అఖిల్ ను, 'ఏజెంట్' సినిమా కాస్త గట్టిగానే ఇబ్బంది పెట్టింది. దాంతో కాస్త గ్యాప్ తీసుకుని, కథపై ఎక్కువగానే కసరత్తులు చేస్తూ అఖిల్ లైన్లో పెట్టిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమా ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. శ్రీ రామాపురంలో 'భారతం మిట్ట' అనే ప్రదేశం ఉంటుంది. మహాభారత కాలంతో ముడిపడిన ఆ ప్రదేశంలో 'ద్రౌపది దేవి' పూజలందుకుంటూ ఉంటుంది. ప్రతి ఏటా ద్రౌపదీదేవికి అక్కడ జాతర నిర్వహిస్తూ ఉంటారు. భర్తను కోల్పోయినప్పటికీ ఆ ఊరిపై జయంతి (ఈశ్వరీరావు) పెత్తనం చేస్తుంటుంది. అనాథగా ఆ ఊళ్లో అడుగుపెట్టిన 'లెనిన్' (అఖిల్)ను ఆమెనే చేరదీస్తుంది. తన కొడుకు వసంత్ (ప్రమోద్)తో పాటు పెంచుతుంది. డాక్టర్ గా పై చదువులు కోసం వసంత్ మద్రాస్ వెళ్లిపోగా, జయంతికి సంబంధించిన పనులను చూసుకుంటూ లెనిన్ అక్కడే ఉండిపోతాడు. ఆ ఊరిపెద్ద మనుషులలో ఒకరుగా నీలకంఠం (రాంకీ) చెలామణి అవుతుంటాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు ఒకరు 'వైదేహి' అయితే .. మరొకరు 'భారతి' ( భాగ్యశ్రీ బోర్సే). పట్నంలో బంధువుల దగ్గరే ఉంటూ చదువుకున్న భారతీ, తన సొంత ఊరుకు చేరుకుంటుంది. ఆమెను చూడగానే లెనిన్ మనసు పారేసుకుంటాడు. ఇక డాక్టర్ చదువును పూర్తి చేసుకుని ఆ ఊరికి తిరిగొచ్చిన 'వసంత్'ను వైదేహి ప్రేమిస్తుంటుంది. దాంతో వాళ్లిద్దరికీ పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించుకుంటారు. ఆ గ్రామంపై పట్టు కోసం ఎమ్మెల్యే రాఘవరెడ్డి ప్రయత్నిస్తుంటాడు. తనని ఎంతమాత్రం లెక్కచేయని లెనిన్ – వసంత్ ల సంగతి చూడాలనే కోపంతో ఆయన ఉంటాడు. ఇక 'భారతం మిట్ట'పై పెత్తనం కోసం 'యతిరాజు' (శివాజీ) ఎదురుచూస్తుంటాడు. ఈ విషయంలో తనకి అడ్డుపడుతున్న జయంతిపై ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. ఇక లెనిన్ పై మనసు పడిన భారతిని వశపరచుకోవాలనే ఉద్దేశంతో 'తులసి' (శత్రు) ఉంటాడు. ఈ నేపథ్యంలోనే వసంత్ ను పెళ్లి చేసుకోవలసిన వైదేహి కనిపించకుండా పోతుంది. దాంతో అదే ముహూర్తానికి తన చిన్న కూతురైన భారతిని వసంత్ కి ఇచ్చి పెళ్లి చేయాలని నీలకంఠం నిర్ణయించుకుంటాడు. అప్పుడు భారతి ఏం చేస్తుంది? లెనిన్ తో ఆమె వివాహం జరుగుతుందా? ఆమె అక్కయ్య వైదేహి ఏమైపోతుంది? రాఘవరెడ్డి .. యతిరాజు .. తులసితో పాటు లెనిన్ ఎదుర్కోవలసిన మెయిన్ విలన్ ఎవరు? అనేది మిగతా కథ. శ్రీ రామాపురం అనే ఊరు 'లెనిన్' అనే యువకుడిని పెంచి పెద్ద చేస్తుంది. అందువలన తనను చేరదీసి కుటుంబానికి .. తనకి నీడనిచ్చిన ఊరుకి అతను ఎంతో నమ్మకంగా ఉంటూ ఉంటాడు. అలాంటి అతను భారతి ప్రేమలో పడతాడు. అయితే ఆ ప్రేమను పెళ్లి పీటలవరకూ తీసుకుని వెళ్లడానికి అతను కొంతమంది



శత్రువులను ఎదుర్కోవలసి వస్తుంది. వాళ్లు ఎవరూ? వాళ్లతో అతనికి గల శత్రుత్వం ఏమిటి? అనేది ప్రధానమైన కథ. 1970 – 2000 కి మధ్య జరిగే ఈ కథలో అనేక కోణాలు కనిపిస్తాయి. ఆహ్లాదకరమైన గ్రామంలో అందమైన ప్రేమజంట. ఆ గ్రామంపై పట్టు కోసం ఎదురుచూసే ఒక రాజకీయనాయకుడు, అక్కడ జాతర తన చేతుల మీదుగా జరగాలనే అధికార దాహంతో ఒకరు .. ఆ ప్రేమజంటను విడదీయాలనే ఆలోచనలో మరొకరు. నమ్మిస్తూ నమ్మక ద్రోహానికి సిద్ధమవుతున్నదొకరు. ఇలా వివిధ కోణాల నుంచి అల్లుకున్న ఈ కథను ఆసక్తికరంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. ఇక దర్శకుడు 'ద్రౌపది' జాతరను ప్రధానంగా చేసుకుని, మహాభారతంలోని పాత్రలతో ముడిపెడుతూ ఈ కథను నడిపించాడు. ఫస్టు పార్టులో ఫస్టు ట్విస్ట్ ను ఇంటర్వెల్ కి ముందు పేల్చిన దర్శకుడు, అక్కడి నుంచి కథను మరింత వేడెక్కిస్తాడు. ఇక సెకండాఫ్ కూడా మరో ఒకటి రెండు ట్విస్టులతో వేగాన్ని పుంజుకుంటుంది. ద్వేషం .. ప్రతీకారం .. నమ్మకద్రోహంతో కూడిన సన్నివేశాలతో నడుస్తుంది. ఈ కథను మొత్తంగా పరిశీలన చేస్తే, అధికారం .. పెత్తనం .. కామం.. వ్యామోహం అనే బలహీనతలతో తనపై విరుచుకుపడుతున్న అరాచక శక్తులను కథానాయకుడు ఎలా ఎదుర్కొన్నాడు? అనేదే ప్రధానమైన ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఫస్టాఫ్ చాలా వరకూ హీరో – హీరోయిన్స్ మధ్య లవ్ – రొమాన్స్ .. అందుకు సంబంధించిన పాటలతో రక్తి కడుతుంది. ఇక సెకండాఫ్ లో ఆయా పాత్రల నిజస్వరూపాలను ఆవిష్కరించడం కనిపిస్తుంది. వారి అసలు రంగును తెలుసుకుంటూ హీరో ప్రీ క్లైమాక్స్ వైపు దిశగా కదులుతాడు. ఇక అప్పటి వరకూ సాగిన రక్తపాతం ఒక ఎత్తయితే, క్లైమాక్స్ లో చెలరేగే హింస మరో ఎత్తు. ఎంతో కొత్తగా ప్లాన్ చేశామని అనుకున్నప్పటికీ, క్లైమాక్స్ అనేది అన్ని వర్గాల ప్రేక్షకులకు సంతృప్తిని కలిగిస్తుందని చెప్పలేము. అఖిల్ నటన .. యాక్షన్ ..డాన్సులు బాగానే ఉన్నాయి. భాగ్యశ్రీ పాత్ర అంతగా బలమైనదేం కాదు గానీ, అందంగా.. ఆకర్షణీయంగా కనిపిస్తూ మార్కులు కొట్టేస్తుంది. పెళ్లి కూతురి గెటప్ లోను .. కొన్ని పాటల్లోను ఆమె గ్లామర్ కుర్రాళ్లను కట్టిపడేస్తుందనే చెప్పాలి. ఇక నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రలో ప్రమోద్ బాగా చేశాడు. కొన్ని చోట్ల నానీలా అనిపిస్తాడు. ఈశ్వరీరావు .. శివాజీ నటన కూడా ఆకట్టుకుంటుంది. లియోన్ బ్రిట్టో ఫొటోగ్రఫీ బాగుంది. ఫస్టు పార్టులో వచ్చే రెండు డ్యూయెట్స్ లోని లొకేషన్స్ ను కవర్ చేసిన విధానం గొప్పగా అనిపిస్తాయి. తమన్ బాణీలు .. నేపథ్య సంగీతం మెప్పిస్తాయి. నవీన్ నూలి ఎడిటింగ్ కూడా మెప్పిస్తుంది. భారతం .. కురుక్షేత్రంతో పోలికపెడుతూ ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చడానికి చేసిన ప్రయత్నం బాగుంది. కానీ విలన్స్ ఎక్కువమంది కావడం .. ఆ పాత్రలకు అవసరమైన పవర్ లోపించడం .. క్లైమాక్స్ ను డిజైన్ చేసే విషయంలో తీసుకున్న నిర్ణయం అసంతృప్తిని కలిగిస్తాయి. ఒక ఆసక్తికరమైన ఆరంభాన్ని నిదానంగా ట్రాక్ తప్పించారేమో అనే భావన కలుగుతుంది. కథాకథనాలు పాత పద్ధతిలోనే సాగినా, అఖిల్ యాక్షన్ కోసం .. భాగ్యశ్రీ గ్లామర్ కోసం .. ఇద్దరూ కలిసి వర్కౌట్ చేసిన కెమిస్ట్రీ కోసం ఈ సినిమాను చూడొచ్చునేమో.

## జన నాయకన్‌కు 'ఏ' సర్టిఫికేట్.. క్లియరెన్స్ ఇచ్చిన సెన్సార్ బోర్డు



ముంబై : తమిళనాడు సీఎం విజయ్ నటించిన చిత్రం జన నాయకన్(ఝుఋ ఛీఝుస్త్రుఅ)పై కొత్త అప్‌డేట్ వచ్చింది. ఆ ఫిల్మ్‌కు సెన్సార్ బోర్డు క్లియరెన్స్ ఇచ్చింది. జన నాయకన్ సినిమాకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. సీబీఎఫ్‌సీ అధికారిక వెబ్‌సైట్‌లో జన నాయకన్ సినిమాకు చెందిన సర్టిఫికేట్ అందుబాటులో ఉన్నది. 183 నిమిషాల(3 గంటల 3 నిమిషాలు) నిడివితో ఉన్న ఈ సినిమాకు సర్టిఫికేట్ జారీ చేసినట్లు సీబీఎఫ్‌సీ చెప్పింది. అయితే ఈ సినిమా సెన్సార్ కోసం జరిగిన కట్స్ గురించి మాత్రం వెబ్‌సైట్‌లో పెట్టలేదు. వాస్తవానికి ఈ ఫిల్మ్ పొంగల్ పండుగ సందర్భంగా జనవరి 9వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. కానీ సెన్సార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో ఫిల్మ్ రిలీజ్ నిలిచిపోయింది. 2025 డిసెంబర్‌లో ఈ సినిమా సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీన్ కట్ చేస్తే.. ప్రస్తుతం తమిళనాడు సీఎంగా విజయ్ బాధ్యతలు స్వీకరించారు. తాజా సమాచారం ప్రకారం 'జన నాయకన్' ప్రపంచవ్యాప్తంగా జూలై 24, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. విదేశీ డిస్ట్రిబ్యూటర్లకు కూడా ఇదే రిలీజ్ డేట్‌ను అధికారికంగా తెలియజేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమా విజయ్ సినీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. నటుడిగా ఆయన చివరి చిత్రం కావడం వల్ల అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజకీయ, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం విజయ్‌కు గ్రాండ్ ఫేర్‌వెల్ మూవీగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. యువ నటి మమితా బైజు కూడా కీలక పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, దర్శకుడు-నటుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్, సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, నరైన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమా కథపై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఖుచీ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. విజయ్-అనిరుధ్ కాంబినేషన్‌లో వచ్చిన గత చిత్రాల పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిన నేపథ్యంలో, 'జన నాయకన్' సంగీతంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



## ఇంకో కారు కొనడానికి ముద్దు సీన్లలో నటించాలా?

### - వ్యక్తిగత విలువలపై సాయి పల్లవి వ్యాఖ్యలు

మలయాళ చిత్రం 'ప్రేమమ్'లో మలర్ పాత్రతో కెరీర్ ప్రారంభించి, శేఖర్ కమ్ముల 'ఫిదా' సినిమాతో టాలీవుడ్‌లో 'లేడీ పవర్ స్టార్'గా గుర్తింపు తెచ్చుకున్న నటి సాయి పల్లవి. సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అగ్ర కథానాయికగా దూసుకుపోతున్నా, గ్లామర్ పాత్రలకు, కమర్షియల్ హంగులకు దూరంగా ఉంటూ తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సినిమాల్లో ముద్దు సన్నివేశాలు, ఇంటిమేట్ సీన్లపై ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో యాంకర్.. "దర్శకులు ఎప్పుడైనా మిమ్మల్ని ముద్దు సన్నివేశాల్లో నటించమని అడిగారా? అలా చేయకూడదని ఎందుకు నిర్ణయించుకున్నారు?" అని ప్రశ్నించగా, సాయి పల్లవి ఎంతో నిజాయతీగా, కుండబద్దలు కొట్టినట్లు సమాధానమిచ్చారు. "అవును, చాలా మంది దర్శకులు అడిగారు.. ఇప్పటికీ అడుగుతూనే ఉంటారు. నేను ముద్దు సీన్లు చేయనని తెలిసినా అలాంటి ఆఫర్లు వస్తుంటాయి. ఒకవేళ నాకు ఒక జీవిత భాగస్వామి లేదా బాయ్‌ఫ్రెండ్ ఉంటే, కేవలం నటన కోసమే అయినా నేను ఇంకొకరిని ముద్దు పెట్టుకోవడం నాకు సరైందిగా అనిపించదు. ఒక మనిషి సంతోషంగా బతకడానికి ఒక మంచి కుటుంబం, ఉండటానికి ఇల్లు, ప్రయాణించ డా నికి ఒక కారు ఉంటే చాలు. అవన్నీ భగవంతుడి దయ వల్ల నాకు ఇప్పటికే ఉన్నాయి.

కేవలం ఇంకో కారు కొనడానికో, లగ్జరీ జీవితం గడపడానికో నా వ్యక్తిగత విలువలను వదులుకుని ఇంకొకరిని ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం నాకు లేదు. నా నటన చూసి మాత్రమే నన్ను సినిమాల్లోకి ఎంపిక చేసుకుంటే చేస్తాను. ఒకవేళ కథకు ముద్దు సీన్లు, ఇంటిమేట్ సన్నివేశాలే ముఖ్యం అనుకుంటే నా స్థానంలో వేరే ఎవరినైనా తీసుకోవచ్చు, అందులో నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని స్పష్టం చేశారు. సాయి పల్లవి చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు, ఆమె అభిమానులు సానుకూలంగా స్పందిస్తున్నారు.

డబ్బు, స్టార్‌డమ్ కోసం కాకుండా నమ్మిన సిద్ధాంతాలకు, వ్యక్తిగత విలువలకు ప్రాధాన్యత ఇస్తున్న ఆమె వ్యక్తిత్వాన్ని అభినందిస్తూ.. 'దటీజ్ సాయి పల్లవి' అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు.

## అఖిల్ 'లెనిన్'కు సమంత విషెస్..

### వైరల్ అవుతున్న పోస్ట్!

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో నటి సమంత.. అఖిల్‌కు, చిత్ర బృందానికి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలపడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'లెనిన్' ట్రైలర్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్న సమంత, అఖిల్‌ను ట్యాగ్ చేస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. "లెనిన్ చిత్ర బృందానికి, అఖిల్‌కు ఆల్ ది వెరీ బెస్ట్. ఇప్పటికే 'పెద్ద బ్లాక్‌బస్టర్ వైబ్స్' కనిపిస్తున్నాయి" అని ఆమె పేర్కొన్నారు.

సమంత విషెస్ చెప్పడం ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. కాగా, ఇటీవలే సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమాపై అఖిల్ కూడా ప్రశంసలు కురిపించారు. 'లెనిన్' ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఆ సినిమా కాన్సెప్ట్ చాలా ఫ్రెష్‌గా ఉందని, వైబ్ బాగుందని అన్నారు. ఇలా ఒకరి చిత్రాలపై మరొకరు పాజిటివ్‌గా స్పందించుకోవడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మూడేళ్ల విరామం తర్వాత అఖిల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'లెనిన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు తగ్గట్టే సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## ఆగస్ట్‌లో వస్తున్న 'అగధ'



అగ్ర

నిర్మాతగా ఎన్నో భారీ విజయాల్ని తన ఖాతాలో వేసుకున్నారు ఎమ్మెస్ రాజు. 'డర్టీహరి' 'మళ్లీపెళ్లి' వంటి సినిమాలతో దర్శకుడిగా కూడా రాణించారాయన. ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'అగధ'. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన తారాగణం. మిస్టిక్ డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 14న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ 'ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. మైథలాజికల్, మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కించాం. విజువల్ వండర్‌లా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు.

అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను తీశామని నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రాకేష్ వెంకటాపురం, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్ నాయర్, నిర్మాణం: శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్, దర్శకత్వం: ఎమ్మెస్ రాజు.

## ఘనంగా డాక్టర్ తిప్పర్తి యాదయ్య జన్మదిన వేడుకలు

**పూలగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించిన నాయకులు**

**సేవా స్ఫూర్తిని కొనియాడుతూ జన్మదిన శుభాకాంక్షలు**

**మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్ష**



తార్నాక (ప్రశ్న న్యూస్ ) మల్కాజ్‌గిరి మున్సిపల్ జాయింట్ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని తార్నాక మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉప్పల్ నియోజకవర్గం ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు కొరపాక అంజి మాదిగ, తెలంగాణ విజయ డెయిరీ జనరల్ మేనేజర్ మోహన్, మురళి తదితరులు పూలగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ తిప్పర్తి యాదయ్య బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో సేవలందిస్తున్న అధికారిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శంగా నిలవాలని, ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో సంవత్సరాలు ఆనందంగా జరుపుకోవాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ములుగు కేసులో కోర్టు సంచలన తీర్పు.

**గంజాయి రవాణా ముగ్గురికి 10 ఏళ్ల జైలు, రూ.1 లక్ష జరిమానా**



ములుగు(ప్రశ్న న్యూస్)ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన గంజాయి కేసులో జిల్లా కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగారం, రూ.1 లక్ష జరిమానా జిల్లా జడ్జి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ విధించారు. చెక్క కుమారస్వామి (35), డ్రైవర్, పందికుంట రాయనేని శంకర్ (48), వ్యాపారి, గోరుకొత్తపల్లి రాగుల ఐలయ్య (60) కేసు దర్యాప్తు చేసిన అప్పటి సీఐ దేవేందర్ రెడ్డి, కోర్టు మానిటరింగ్ డీఎస్పీ కిషోర్ కుమార్, స్పెషల్ పీపీ రామ్ సింగ్, సీఐ సురేష్, కానిస్టేబుల్ ప్రవంతి లను ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ అభినందించారు. గంజాయి అక్రమ రవాణా గురించి సమాచారం ఇచ్చిన వారికి నగదు బహుమతి, గోప్యత ఉంటుందని ఎస్పీ తెలిపారు.

## తిరుపతి ఐజర్ నందు ఏడవ వార్షికోత్సవం సంబరాలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తిరుపతి ఐజర్ నందు ఏడవ వార్షికోత్సవం పురస్కరించుకొని వార్షికోత్సవ సంబరాలు నిర్వహించారు ఈ సంబరాలలో ఈ ఏడాది ఉత్తీర్ణత పొందిన విద్యార్థినీ విద్యార్థులకు, ముఖ్యఅతిథి నేషనల్ సెక్యూరిటీ అడ్వైసోరీ బోర్డు ఫార్మర్ చైర్మన్ సతీష్ రెడ్డి ఐజర్ డాక్టర్ శాంతాను భట్టాచార్య చేతుల మీదుగా ఉత్తీర్ణత పొందిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు మంజూరు చేశారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు గోల్డ్ మరియు సిల్వర్ మెడలను ప్రధాన ఉత్సవం చేశారు ఈ సందర్భంగా ఐజర్ డైరెక్టర్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైసోరీ బోర్డు ఫార్మర్ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ.ఐజర్ విద్యాసంస్థ విద్యార్థుల ప్రతిభను కనబరిచి, వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఈ విద్యా సంస్థ ఎంతగానో దోహదపడుతుందని ఈ విద్యాసంస్థలు విద్యాభ్యాసం చదివిన విద్యార్థిని విద్యార్థులు నేడు ఉత్తీర్ణత పొంది వారి జీవితంలో వారి పరిశోధనలో అత్యున్నత స్థానాన్ని సంపాదించుకోవాలని, తెలియజేశారు ఐఐటి ఐజర్నందు ఉత్తీర్ణత పొందిన విద్యార్థిని విద్యార్థులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిని అభివృద్ధి పరిచే విధంగా అనేక, సంక్షేమ పథకాలతో బ్యాంకు లోన్లను అందజేస్తుందని, విద్యార్థిని విద్యార్థులు ఈ బ్యాంక్ లోన్ ద్వారా తమ ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకొని దేశ ప్రగతికి దోహదపడే విధంగా పరిశోధనలు కొనసాగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఇటిక్యాలలో మెగా ఆయిల్‌పామ్ నాటే కార్యక్రమం

## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

**- మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో జాతీయ తినదగిన నూనెల మిషన్-ఆయిల్‌పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ) పథకం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఆయిల్‌పామ్ నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు నిమ్మ రాంరెడ్డికు చెందిన 6.5 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు మాట్లాడుతూ, రైతులు సంప్రదాయ పంటలతో పాటు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించి ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ తినదగిన నూనెల మిషన్-ఆయిల్‌పామ్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని, ప్రభుత్వం ఉచిత మొక్కలు, సాంకేతిక సలహాలు, వివిధ ప్రోత్సాహకాలు అందిస్తున్నందున అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఈఓ సమత, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై టిడబ్ల్యూజేఎఫ్ ధర్నా

**- జూలై 13న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట నిరసన**

**- జూలై 15న సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద బహిరంగ నిరసన - టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు**

మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి డబ్ల్యు జె ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా 13,వ తేదీన మేడ్చల్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా ను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని టి డబ్ల్యు జె ఎఫ్ రాష్ట్ర నాయకులు గుమ్మడి హరిప్రసాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పబ్బు మల్లేష్ గౌడ్, బనావత్ రవి నాయక్ అభిప్రాయపడ్డారు. ఈనెల 13న జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాలు అందజేసి నిరసనలు, 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు అన్నారు . హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్పత్రి మినహా ఏ ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేయడం లేదని వ్యాఖ్యనించారు. వెంటనే జర్నలిస్టులందరికీ



నూతన హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఇండ్ల స్థలాలపై నిర్ణయం తీసుకోకపోవడంతో కార్యాచరణ ముందుకు సాగడం లేదని తెలిపారు. ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఆశలు కల్పించి ఆ తర్వాత వారి ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. అక్రిడిటేషన్



కార్డుల పంపిణీ ఆలస్యమవుతున్నదని, అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డులు ఆలస్యం కావడంతో బస్‌పాసులు రాక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని వారు గుర్తేచేశారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా నిస్వార్థంగా పనిచేస్తున్నారు, అట్టి జర్నలిస్టులకు



ప్రభుత్వం ప్రతి నెలా పెన్షన్ 10వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టి డబ్ల్యు జె ఎఫ్ రాష్ట్ర నాయకులు గుమ్మడి హరిప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

**- ఆర్టీసీ, రవాణా అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ శుక్రవారం జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ, రవాణా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు, డిపో మేనేజర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ అదనపు కార్యదర్శి సునీతాదేవీ లకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మన్ వై.నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, తెలంగాణ లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం పరిమిత సంఖ్యలో ఉన్న



జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పేరుకే 1/3 కానీ జర్నలిస్టుల నుంచి 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు ప్రయాణ చార్జీలు భారమవుతుందని,దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా(తెలంగాణ ఎర్త్ వైడ్) ఉచిత ప్రయాణం, ఇతర రాష్ట్రాలకు 1/3 రాయితీ సదుపాయం



కల్పించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి ని (ఎం జి బి ఎస్ ) కలిసి ఫ్రీ బస్ పాస్ కు సంబంధించిన వినతి పత్రాన్ని టి డబ్ల్యు జె ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్ పొట్లపల్లి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడుసానెం శ్రీనివాస్ గౌడ్, ఎల్బీనగర్ కోశాధికారి నంబి పర్వతాలు, సభ్యుడు మాధగోని రామకృష్ణ గౌడ్ లుఇచ్చి,సమస్యను వివరించారు ..ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామారావు, పద్మనాభరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, నాయకులు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్ ను నియమించరు, సమస్యలు తీర్చరు

**- తెలంగాణ వైద్య ఉద్యోగుల ఐక్య వేదిక**

**- తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**- రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల ముందు నిరసన కార్యక్రమాలు**

**- పెండింగ్ సమస్యలు పరిష్కరించనిచో భారీ ఎత్తున ఉద్యమాలు**

మలక్ పేట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ వైద్య విధాన పరిషత్ (డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్) లో గత 40 రోజుల కింద పదవి విరమణ చేసిన డాక్టర్ అజయ్ కుమార్ స్థానంలో నూతన కమిషనర్ నియామకం చేపట్టక పోవడంతో శాఖాపరంగా శూన్యత ఏర్పడి చాలా సమస్యలు పేరుకు పోతున్నాయని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యంఎస్ మూర్తి అన్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (డైరక్టర్ అఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్) లో పేరుకు పోయిన సమస్యలను పరిష్కరించి వెంటనే పూర్తి స్థాయి కమీషనర్ / డైరెక్టర్ పోస్టును భర్తీ చేయాలని తెలంగాణ వైద్య ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మలక్ పేట్ యంఏన్ ఏరియా ఆసుపత్రి లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్ మూర్తి మాట్లాడుతు గత 40 రోజులుగా కమీషనర్ పోస్టు ఖాళీ ఉన్నాను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత కమీషనర్ పదవి విరమణ చేయడంతో పూర్తిస్థాయి బాధ్యతలను వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కట్టపెట్టి ఖాళీ అయిన పోస్టును భర్తీ చేయడంలో జరుగుతున్న జాప్యం, ప్రిన్సిపల్ సెక్రటరీ సమయం కేటాయించకపోవడంతో పాలనాపరమైన శూన్యత ఏర్పడి ఉద్యోగుల సర్వీస్ సంబంధిత సమస్యలు పేరుకు పోతున్నాయని, ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, డిమాండ్ చేస్తు ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రస్తావించారు.

- వైద్య విధాన పరిషత్ కు పూర్తిస్థాయి రెగ్యులర్ కమిషనర్ ను వెంటనే నియమించాలి
- పెండింగ్‌లో ఉన్న రీడిప్లాయ్‌మెంట్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలి.
- సాధారణ బదిలీల వల్ల ఏర్పడిన అన్ని పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించాలి.
- వైద్య రీయింబర్స్‌మెంట్ బిల్లులతో సహా అన్ని పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి.
- అన్ని అర్హత కలిగిన అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ప్రమోషన్ ప్రక్రియను పూర్తి చేయాలి.
- వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి.
- కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని డిఎస్‌ఎచ్‌ఎస్ / టివివిపి ఆసుపత్రులకు తగిన కేడర్ బలాన్ని మంజూరు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న అన్ని అధికారిక చర్యలను పూర్తి చేసి, సర్వీస్ రిజిస్టర్లను సంబంధిత ఆసుపత్రులకు వెంటనే పంపించాలి.
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులను ముందుగానే జారీ చేసి, వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలి.
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎంటిఎస్ ఉద్యోగుల




పోస్టులను బదిలీల సమయంలో ఖాళీలుగా చూపకూడదు.
- ఈ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ / డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ముందు ఉద్యోగులు నిరసన ప్రదర్శనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.
- సమస్యలు పరిష్కారం కానిచో భవిష్యత్తులో తమ ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.
- ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించడం ద్వారా వారి మనోధైర్యం పెరగడంతో పాటు శాఖాపరంగా సామర్థ్యం మరింతగా మెరుగుపడి, ప్రభుత్వ వైద్య సేవల నాణ్యత పెరుగుతుందని ఉద్యోగులు పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నూతన కమీషనర్ ను నియమించి పెండింగ్ సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాధా, స్వర్ణలత, నళిని, జగన్, అన్నపూర్ణ, సుమతి, రమనేశ్వరి, మాధవి,వైష్ణవి, కిరణ్, పప్పురాజ, శంకర్, ఐ సి టి సి సంతోష్, గాంధీ, శ్రీలత, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డులో పాల్గొన్న కంసాని రమేష్‌కు ఘన సన్మానం

**గజ్వేల్ ఏసిపి నర్సింలు**

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అత్యధిక సంఖ్యలో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధనలో భాగస్వామిగా నిలిచిన కంసాని రమేష్‌ను గజ్వేల్ ఏసిపి నర్సింలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు పతకాలను అందజేసి అభినందనలు తెలిపారు. విజన్ యుద్ధకళల అకాడమీ, జేఆర్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో కంసాని రమేష్ విజయవంతంగా పాల్గొని విశిష్ట గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కంసాని రమేష్ అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల, ఉత్సాహభరితమైన భాగస్వామ్యం ఈ ప్రతిష్ఠాత్మక విజయానికి ఎంతో దోహదపడిందని కొనియాడారు. ఆయన కృషి, నిబద్ధతకు గుర్తింపుగా అధికారిక ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు వంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంలో భాగస్వామిగా నిలవడం సిద్దిపేట జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో

# 'బెల్ట్' రాజ్యాలు



## మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులా.?

- గల్లీ గల్లీలో మద్యం ఏరులై పారుతుంటే మౌనం ఎందుకు.?
- ప్రభుత్వ నియమ నిబంధనలకు తూట్లు
- అర్ధరాత్రి దాటినా ఆగని అక్రమ విక్రయాలు
- పర్మిట్ రూమ్ తరహాలో 'బెల్ట్' సిట్టింగ్స్
- అధికారుల అండతోనే సామాన్యుల జీవితాలతో చెలగాటం
- మామూళ్ల కోసం కళ్లు మూసుకున్న ఎక్సైజ్ శాఖ.. క్షేత్రస్థాయిలో పెరిగిన అక్రమ దందా,
- దాడుల ఊసే లేదు.. బాధ్యత మరిచిన అధికారులు
- ప్రశ్నిస్తే పట్టించుకోని అధికార యంత్రాంగం
- 24/7 మద్యం ఏరులై పారుతుంటే అధికారుల నిశ్శబ్దం ఎందుకు.?

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ, మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారిక 'బెల్ట్ షాపులు' రాజ్యమేలుతున్నాయి. మద్యం మత్తులో తూలుతున్న మందుబాబులతో సామాన్య ప్రజలు, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే మామూళ్ల మత్తులో జోగుతూ, అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### గల్లీ గల్లీలో మద్యం.. 24/7 దందా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు నిర్ణీత సమయాల్లోనే పనిచేయాలి. కానీ, మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామం, ప్రతి గల్లీలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

ఇవి కేవలం మద్యం విక్రయించడమే కాకుండా, పర్మిట్ రూమ్‌లకు ధీటుగా బహిరంగంగా 'సిట్టింగ్' సదుపాయాలను కూడా కల్పిస్తున్నాయి. అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండా 24/7 మద్యం లభిస్తుండటంతో, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది.

### మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులా.?

ఈ అక్రమ వ్యాపారాల వెనుక ఎక్సైజ్ అధికారుల హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. "ఎంత ఎక్కువ అమ్మకాలు జరిగితే, అంత ఎక్కువ మామూళ్లు" అన్న చందంగా అధికారుల తీరు తయారైందని పలువురు మద్యం ప్రియులు ఆరోపణలు చేస్తున్నారు. ప్రతి బెల్ట్ షాపు నుంచి నెలకు నిర్ణీత మొత్తం అధికారులకు చేరుతుందనే అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఫిర్యాదులు అందుతున్నా, అక్రమ అమ్మకాలు జరుగుతున్నట్లు అధికారులకు తెలిసినా, వారు కళ్ళుండి చూడలేనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటో అందరికీ తెలిసిందే. సర్కార్‌కు వచ్చే ఆదాయం పెరుగుతుందన్న నెపంతో



ఎక్సైజ్ శాఖ చూసీచూడనట్లు వదిలేస్తోంది.

### దాడులు శూన్యం.. అక్రమార్కుల పండగ..

చట్ట విరుద్ధంగా సాగుతున్న ఈ దందాను అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ, దాడుల విషయంలో పూర్తిస్థాయిలో విఫలమైంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి, తమ పనే కాదన్నట్లుగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఫలితంగా, మేడ్చల్ పరిధిలోని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంటే, ఆ ప్రభావం సామాన్య కుటుంబాలపై తీవ్రంగా పడుతోంది.

### ప్రజల గోడు ఎవరికి చెప్పుకోవాలి.?

గ్రామాల్లో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపుల వల్ల చిన్న చిన్న గొడవలు మొదలై పెద్ద నేరాలకు దారితీస్తున్నాయి.

మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరిగాయి. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల ప్రవర్తన వల్ల మహిళలు బయట తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. "మాకు రక్షణ కల్పించాల్సిన ఎక్సైజ్ శాఖ, మా ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యల సుడిగుండంలో మేడ్చల్ సర్కిల్

- అభివృద్ధికి ఆమడ దూరంలో మేడ్చల్ అటకెక్కిన అభివృద్ధి
- అసంపూర్తిగా ప్రగతి పనులు అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- అరకొరగా మౌలిక వసతులు ప్రజాప్రయోజనాలపై పట్టింపు కరవు
- మేడ్చల్ సమగ్రాభివృద్ధి పై దృష్టి సారించని అధికారులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు అధికారుల స్పందన కోసం నిరీక్షణ
- ఎర్ర విజయ్ రావు, ఐ.ఎన్.టి.యు.సి ఆటో యూనియన్ అధ్యక్షుడు





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మేడ్చల్ సర్కిల్ కార్యాలయం నేడు అంతులేని సమస్యల వలయంలో ద చిక్కుకొని, అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారుతున్నా మేడ్చల్ సర్కిల్ పరిధిలో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం లేకుండా సర్వత్రా మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక అవసరాలు తీర్చడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అసంపూర్తి పనులు.. అస్తవ్యస్తంగా మౌలిక వసతులు..

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఎన్నో అభివృద్ధి పనులు నేటికీ అసంపూర్తిగానే ఉండటం గమనార్హం. ప్రారంభానికి నోచుకోని ప్రాజెక్టులు ఒకవైపు ఉంటే, ప్రస్తుత ప్రభుత్వంలో చేపట్టిన కొత్త పనులు క్షేత్రస్థాయిలో ముందుకు సాగక నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా రోడ్ల దుస్థితి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మెడ్చల్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారాయి. దీనివల్ల సామాన్య ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతుండగా, నిత్యం రోడ్లపైనే ఆధారపడి జీవించే ఆటో డ్రైవర్లు ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. వాహనాలు నిత్యం పాడైపోతుండటంతో బాగు చేయించుకునే స్థోమత లేక వారు అల్లాడిపోతున్నారు.

### నిర్లక్ష్యం వీడాలి.. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా కదలాలి..

మేడ్చల్ సర్కిల్ పరిధిలో మెయిన్ వాల్స్ దెబ్బతిని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతున్నా, అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వందల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కనీస సదుపాయాలు కల్పించడంలో ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### అధికారుల స్పందన కోసం నిరీక్షణ : ఎర్ర విజయ్ రావు, ఐ.ఎన్.టి.యు.సి ఆటో యూనియన్ అధ్యక్షుడు

తక్షణమే సంబంధిత అధికారులు, డిప్యూటీ కమిషనర్ రంగంలోకి దిగి మేడ్చల్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎర్ర విజయ్ రావు కోరారు. సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, క్రమబద్ధమైన పారిశుద్ధ్య నిర్వహణ వంటి ప్రాథమిక అంశాల మీద ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ప్రజాసమస్యలు మరింత జటిలమై, ప్రజాగ్రహం పెల్లుబికే ప్రమాదం ఉందని ఎర్ర విజయ్ రావుతో పాటు స్థానిక ఆటో డ్రైవర్ల యూనియన్ నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు రాజకీయాలను పక్కన పెట్టి, ప్రజల కష్టాలను తీర్చడంపై దృష్టి పెట్టాలని ఎర్ర విజయ్ రావు కోరుతున్నాడు.





# రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పరామర్శించిన ప్రదీప్ సింగ్

## ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ప్రదీప్ సింగ్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** వరంగల్ జిల్లా కన్నేపల్లి రిజర్వ్ పర్యటనకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఎక్స్‌పర్ట్ ఫోర్సు గార్డెనింగ్ సెక్యూరిటీ సర్వీసెస్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్ సింగ్ ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు.

### ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ప్రదీప్ సింగ్..

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్ సింగ్ ఆయనను కలిసి ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుతం ఉన్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ సింగ్ మాట్లాడుతూ "ప్రమాద ఘటన తనను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని, అయితే ప్రస్తుతం ఎమ్మెల్సీ కోలుకుంటున్నారని తెలిసి ఊరట చెందానని" అన్నారు. ఆయన త్వరగా కోలుకుని, తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# సర్వీస్ కాల్స్‌కు 1600, ప్రమోషన్స్‌కు 140

## - ట్రాయ్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇటీవలి కాలంలో 1600, 140 సిరీస్ ఫోన్ నంబర్ల వినియోగంపై ప్రజల్లో, మీడియాలో తలెత్తిన గందరగోళాన్ని నివృత్తి చేస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం స్పష్టతనిచ్చింది. ఈ నంబర్ల కేటాయింపు, వినియోగంపై టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఒక వివరణాత్మక ప్రకటన విడుదల చేసింది. ట్రాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం, 1600 సిరీస్ నంబర్లను కేవలం సేవాపరమైన, లావాదేవీలకు సంబంధించిన సమాచారం కోసమే కేటాయించారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాలకు చెందిన సంస్థలతో పాటు ప్రభుత్వ విభాగాల పౌరులకు సమాచారం అందించేందుకు ఈ సిరీస్‌తో ఫోన్ నెంబర్లను వినియోగిస్తాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెబీ, ఐఆర్‌డీఏఐ వంటి నియంత్రణ సంస్థల పరిధిలోని సంస్థలు పంపే ముఖ్యమైన అలర్ట్‌లు ఈ నంబర్ల నుంచే వస్తాయి. వినియోగదారుల విశ్వసనీయతను పెంపొందించేందుకు, 1600 సిరీస్ నుంచి వచ్చే కాల్స్‌ను టెలికాం ఆపరేటర్లు లేదా థర్డ్-పార్టీ యాప్‌లు బ్లాక్ చేయడం లేదా ఫిల్టర్ చేయడానికి అనుమతి లేదని ట్రాయ్ స్పష్టం చేసింది. అదేవిధంగా 140 సిరీస్ నంబర్లను పూర్తిగా ప్రచార (ప్రమోషనల్) కాల్స్ కోసం కేటాయించారు. వినియోగదారులు 'డూ నాట్ డిస్టర్బ్' రిజిస్ట్రీ ద్వారా ఈ కాల్స్‌ను నియంత్రించుకోవచ్చు. తమకు ఇష్టం లేని ప్రచార కాల్స్‌ను నిరోధించేందుకు డీఎన్‌డీ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని ట్రాయ్ పేర్కొంది. అవాంఛిత వాణిజ్య కాల్స్‌పై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో, కీలకమైన సేవా కాల్స్‌కు, ప్రచార కాల్స్‌కు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించేలా ఈ వివరణ ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే

## - బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతానన్న షేక్ హసీనా



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు. "వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి" అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు. 2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రిబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588